



నదిలోకి ప్రవేశిస్తున్న కళ్ళలగర్‌స్వామి

స్వర్ణ అశ్వవాహనంపై
కళ్ళలగర్ వైగైనదీ ప్రవేశం

మదురైలో పులకించిన భక్తజనం ● శూడికొడుత్త మాలతో అపూర్వదర్శనం

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పచ్చటి పట్టువస్త్రం, శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి పంపిన శూడికొడుత్త మాలను ధరించి స్వర్ణాశ్వారూఢులై మదురై నగరానికి వేంచేసిన కళ్ళలగర్ స్వామి సూర్యోదయ వేళలో స్వర్ణకాంతులు ప్రసరిస్తుండగా మంగళవాయిద్యాలు, చండీమేళాల నడుమ వైగై నదిలోకి ప్రవేశించారు. నదీ ప్రవేశ వైభవోత్సవాన్ని తిలకించేందుకు దేశవిదేశాల నుంచి విచ్చేసిన లక్షలాది మంది భక్తులతో మదురై నగరం నిండిపోయింది. అన్నిచోట్లా కళ్ళలగర్‌స్వామిని ఆహ్వానిస్తూ ఇళ్ళల్లో మామిడి తోరణాలు, వీధులలో రంగవల్లులు, ప్రధాన కూడళ్లలో అరటిచెట్లు, కొబ్బరి ఆకులతో స్వాగత తోరణాలు కట్టి మదురై నగరవాసులు ఆ స్వామివారిపై తమకున్న భక్తి ప్రపత్తులను ఎలుగెత్తి చాటుకున్నారు. కళ్ళలగర్ వేంచేయడానికి రెండు రోజులకు ముందే ఆ స్వామిని ఆహ్వానించేందుకు మదురైవాసులంతా ముందస్తు ఏర్పాట్లు చేపట్టారు. ప్రధాన కూడల్లో విద్యుద్దీపాలంకరణలు కూడా చేశారు. ఇంతటి పకడ్బందీ ఏర్పాట్ల మధ్య కళ్ళలగర్ స్వామివారు మదురై నగరంలో వేంచేసి, వైగై నదీలోకి ప్రవేశించారు.

చిత్తిరై బ్రహ్మోత్సవాల్లో భాగంగా అళగర్‌మలై నుంచి సుందరరాజపెరుమాళ్ కళ్ళలగర్ వేషధారణలో కండాంగి పట్టు వస్త్రాలను ధరించి చెర్నాకోల, పొన్నుకర్రను పట్టుకుని స్వర్ణపల్లకీలో ఆదివారం సాయంత్రం మదురై నగరానికి బయలుదేరారు. పొయ్‌క్కారపట్టి, కళ్ళత్రి, అప్పన్‌తిరుప్పది, కడచ్చనేందల్ ప్రాంతాల్లోని మండపాల్లో వేంచేసి సోమవారం ఉదయం ఆరుగంటలకు మదురై సమీపం మూండ్రుమావడి ప్రాంతానికి విచ్చేశారు. అక్కడ కళ్ళలగర్‌ను స్వాగతిస్తూ ఎదురుసేవను నిర్వహించారు. అళగర్ వేషాలు ధరించిన భక్తులు, తోలు సంచుల్లో నింపిన నీటిని చిలకరిస్తూ కళ్ళలగర్‌ను వర్ణిస్తూ కీర్తనలు ఆలపించారు. బాణా సంచా పేల్చుతూ, మంగళవాయిద్యాలు, చండీ మేళాలతో సందడి చేశారు. ఆ తర్వాత అళగర్‌స్వామి అక్కడి నుంచి బయలుదేరి పుదూరు, డీఆర్వో కాలనీ, రిజర్వ్‌లైన్, రేస్‌కోర్సు, ఆవుడపేట మీదుగా దారి పొడవునా శైవ, వైష్ణవాలయాల నిర్వాహకులు ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో కొలువుదీరి, సేదతీరుతూ భక్తులను అనుగ్రహించారు. సోమవారం రాత్రి పది గంటల ప్రాంతంలో తల్లాకుళం ప్రసన్న వెంకటాచలపతి ఆలయంలో కళ్ళలగర్ స్వామి వేంచేశారు. అర్ధరాత్రి తిరుమంజనం నిర్వహించిన అనంతరం స్వర్ణ అశ్వవాహనంలో వేంచేసి, శ్రీవిల్లిపుత్తూరు నుంచి ఆండాళ్ ధరించి ఇచ్చిన (శూడికొడుత్త) పుష్పమాలను ధరించారు. మంగళవారం వేకువజాము 2.30 గంటలకు తల్లాకుళం కరుప్పణ్ణస్వామి ఆలయానికి చేరుకున్నారు. స్వర్ణ అశ్వంపై ఆశీనులై ఆయిరమ్ పొన్ (వేయి స్వర్ణాల) సప్పరంలో వేంచేశారు. తర్వాత వేకువజాము మూడు గంటలకు వైగై నది దిశగా నడకతో బయలుదేరారు. సూర్యోదయానికి కొన్ని నిమిషాలకు ముందు కళ్ళలగర్‌స్వామి స్వర్ణ అశ్వవాహనారూఢులై వైగై నదిలోకి దిగారు. వండియూరు వీరరాఘవ పెరుమాళ్ అంతకు ముందే అక్కడ వేంచేసి కళ్ళలగర్‌స్వామివారిని వైగై నదీ ఆగమన వైభవోత్సవానికి ఆహ్వానించారు. ఈ యేడాది పంటపొలాలు సమృద్ధిగా పండుతాయని సూచించే విధంగా ముదురాకు పచ్చ మేలిమి పట్టు వస్త్రాన్ని ధరించి కళ్ళలగర్ స్వామి వైగై నదిలో వేంచేయగానే భక్తులంతా 'గోవిందా... గోవిందా... కళ్ళలగర్ స్వామియే శరణం' అంటూ చేసిన నినాదాలు ప్రతిధ్వనించాయి. కళ్ళలగర్ వైగై నదీ ఆగమన వైభవోత్సవాన్ని తిలకించేందుకు మదురై, దిండుగల్, శివగంగ, విరుదునగర్, రామనాథపురం, తేని తదితర జిల్లాల నుండే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి భక్తులు రెండు రోజులకు ముందే మదురై చేరుకున్నారు. భక్తజన సముద్రంగా మారిని నదిలోకి స్వామివారు వేంచేయగానే భక్తులంతా పులకించిపోయారు. కోర్టు నిబంధనల ప్రకారం వైగైనదీ జలాలను కళ్ళలగర్‌స్వామిపై, భక్తులపై కుమ్మరించకుండా తీర్థజలాలను చల్లుకున్నట్లు నదీ జలాలను ఒకరిపై ఒకరు చల్లుకున్నారు. చాలా మంది భక్తులు కళ్ళలగర్ స్వర్ణఅశ్వవాహనం నడచిన మార్గంలో ఏర్పడిన, స్వామివారు ధరించిన తామరపుష్పాలు రేకుల సమృద్ధిగా పడి ఉన్న నీటిని శిరస్సులపై చల్లుకున్నారు. బందోబస్తు డ్యూటీకి వెళ్ళిన పోలీసులు సైతం నీటిని తమ శిరస్సులపై చల్లుకున్నారు. స్వామివారి పాదాలను తడిపిన ఆ వైగైనదీ జలాలను అత్యంత పవిత్రంగా భావించి ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కాశీజలంలా సీసాల్లో నింపుకుని స్వస్థలాలకు బయలుదేరారు. ఈ సందర్భంగా వైగనదీ సమీప ప్రాంతాల్లో పలు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేసి మజ్జిగ, పానకం, శీతలపానీయాలను పంపిణీ చేశారు. ఇదే విధంగా శైవ, వైష్ణవ భక్తజన సంఘాల సమాఖ్యల ఆధ్వర్యంలో ఉచితాన్నదాన కార్యక్రమాలు కూడా విరివిగా జరిగాయి.

శశికళ లేఖపై
అన్నాడీఎంకేలో కలకలం

● **పార్టీ నేతలతో ఈపీఎస్ ఆకస్మిక భేటీ**

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తన ప్రశ్నలకు వివరాలతో సమాధానాలను స్వయంగా లేదా తపాలా ద్వారా పంపవచ్చంటూ శశికళ అన్నాడీఎంకే కార్యకర్తలకు పంపిన లేఖలు ఆ పార్టీలో కలకలం రేపింది. అన్నాడీఎంకే పార్టీ ప్రముఖులు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి జయలలిత సన్నిహితురాలు శశికళ 15 ప్రశ్నలతో రాసిన లేఖ ఆ పార్టీలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీతో తెగతెంపులు చేసుకుని డీఎండీకేతో పొత్తు కుదుర్చుకుని అన్నాడీఎంకే పోటీ చేసింది. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) సేలంలోనే ఉంటూ పార్టీ వ్యవహారాలను నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నట్టుండి రాష్ట్రమంతటా ఉన్న పార్టీ శ్రేణులకు శశికళ 15 ప్రశ్నలతో లేఖలు పంపటంపై ఈపీఎస్‌తో పాటు ఆ పార్టీ నేతలంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసమ్మతి కార్యకలాపాలకు పాల్పడిన మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంను పార్టీ నుంచి బహిష్కరించి పార్టీ పగ్గాలు పూర్తిగా ఈపీఎస్ చేపట్టి, లోక్‌సభ ఎన్నికల్లో పార్టీనేతలందరినీ సమైక్య పరిచి అభ్యర్థులను ఎంపిక చేసి పోటీకి దించి పలువురు సీనియర్ల ప్రశంసలు కూడా అందుకున్నారు. ఈ నేపథ్యంలో శశికళ రాసిన లేఖ కారణంగా ఈపీఎస్ సేలం నుంచి ఆగమేఘాలపై సోమవారం రాత్రి నగరానికి చేరుకున్నారు. మంగళవారం ఉదయం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో పార్టీ సీనియర్లతో సమావేశమయ్యారు. నగరానికి చెందిన జిల్లా కార్యదర్శులు డి.జయకుమార్, విరుగై వీఎన్ రవి, ఆదిరాజారామ్, బాలగంగా, టినగర్ సత్యా, వెంకటేష్‌బాబు, ఆర్ఎస్ రాజేష్, వేళచ్చేరి అశోక్, కేపీ కందన్, మాధవరంమూర్తి, అన్నాడీఎంకే అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో లోక్‌సభ ఎన్నికల్లో అన్నాడీఎంకే, మిత్రపక్షాలు చేసిన ప్రచారం, గెలిచేందుకు అవకాశం ఉన్న నియోజకవర్గాల గురించి సమగ్రంగా చర్చించారు. ఆ తర్వాత పార్టీ శ్రేణులకు శశికళ రాసిన లేఖ గురించి కూడా చర్చలు జరిపారు. అన్నాడీఎంకే నుంచి బహిష్కృతులైన టీటీవీ దినకరన్, ఒ. పన్నీర్‌సెల్వం లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీ తమ చేతుల్లోకి వస్తుందని ప్రచారం చేసిన విషయాన్ని కూడా ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నేతలు ప్రస్తావించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై కూడా లోక్‌సభ ఎన్నికల తర్వాత అన్నాడీఎంకే ఓపీఎస్, దినకరన్ వశమవుతుందని పేర్కొనడం పట్ల పార్టీ ప్రముఖులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. శశికళ పార్టీ ప్రముఖులు, కార్యకర్తలకు రాసిన లేఖ వల్ల పార్టీకి ఎలాంటి నష్టం కలగదని, లేఖను పార్టీ శ్రేణులు పెద్దగా పట్టించుకోనవసరం లేదని ఈపీఎస్ పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మౌనం పాటించిన శశికళ దురుద్దేశంతోనే పార్టీ శ్రేణులకు లేఖలు రాసిందని ఆరోపించారు.



అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయంలో ఎంజీఆర్, జయలలిత విగ్రహాలకు అంజలి ఘటిస్తున్న ఎడప్పాడి

ఇంతకీ ఆ లేఖలో ఏముంది?

శశికళ పంపిన లేఖలో పార్టీ కార్యకర్తల వ్యక్తిగత వివరాలు, ఫోన్ నెంబర్లు, 1.1.2017లో నిర్వహించే పార్టీ పదవి, ప్రస్తుత పదవి తదితర వివరాలతో 'శశికళ క్యాంపు కార్యాలయం, 95, జయలలిత ఇల్లమ్, పోయెస్‌గార్డెన్, చెన్నై-86 అనే చిరునామకు పంపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. తన లేఖలోని ప్రశ్నలకు సమాధానాలను రాసి క్యాంపు కార్యాలయంలో తనను నేరుగా కలుసుకుని కూడా అందజేయవచ్చునని శశికళ పేర్కొన్నారు.

ఆ లేఖ ఓ చిత్తుకాగితమే...

అన్నాడీఎంకేకు ఏ మాత్రం సంబంధం లేని శశికళ పార్టీ శ్రేణులకు లేఖ రాయడం గర్హనీయమని సీనియర్ నేత, మాజీ మంత్రి డి. జయకుమార్ అన్నారు. రాయపేటలో ఈపీఎస్ అధ్యక్షతన జరిగిన సమావేశం ముగిసిన తర్వాత మీడియాతో మాట్లాడుతూ శశికళ రాసిన లేఖ పార్టీపై ఎలాంటి ప్రభావం చూపదని, పార్టీ శ్రేణులంతా ఆ లేఖను చిత్తుకాగితంగా పరిగణించాలని కోరారు. పార్టీలో కలకలం సృష్టించేందుకు పనిగట్టుకుని శశికళ ఇలా జోక్యం చేసుకోవడం తగదని ఆయన పేర్కొన్నారు.

కళ్ళలగర్ వేడుకల్లో కలకలం

● **వేటకొడవళ్లతో యువకుడిపై దాడి**

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మదురై వైగైనదిలో నిర్వహించిన కళ్ళలగర్ ఆగమన వేడుకల్లో గుర్తు తెలియని వ్యక్తులు వేటకొడవళ్ళతో దాడి చేసి ఓ యువకుడిని హతమార్చారు. ఈ దుండగుల దాడితో తీవ్రంగా గాయపడిన మరో యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. మదురై ఆళ్వార్‌పురానికి చెందిన కార్తీక్, శివగంగ జిల్లా తిరుపాచ్చేది ప్రాంతానికి చెందిన సోనై (28) స్నేహితులు మంగళవారం వేకువజామున కళ్ళలగర్ వైగై నది ప్రవేశ వేడుకల్లో పాల్గొన్నారు. ఆ సమయంలో కరుప్పణ్ణస్వామి వేషాలు ధరించి కొందరు దుండగులు వేటకొడవళ్లతో వీరిపై దాడి చేశారు. ఆ దాడిలో సోనై తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. కార్తీక్ తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కరుప్పణ్ణస్వామి వేషాలు ధరించి దుండగులు ఈ హత్యకు పాల్పడటం పోలీసులకు దిగ్ర్భాంతి కలిగించింది. కళ్ళలగర్ వైగైనదీ ప్రవేశ వేడుకల్లో స్వామివారిని కరుప్పణ్ణస్వామివారు ఆహ్వానించే రీతిలో యువకులు కరుప్పణ్ణస్వామి వేషాలు వేసుకుని సందడి చేయడం ఆనవాయితీ. కరుప్పణ్ణస్వామి వేషాలు వేసుకునేవారు. ఓ చేత పెద్ద దివిటీని, మరో చేత వేటకొడవలిని తలపించే అట్ట కొడవలిని పట్టుకుని నృత్యం చేస్తారు. ఆవిధంగా దుండుగులు కరుప్పణ్ణసామి వేషాలు వేసుకుని అట్ట కొడవళ్లకు బదులు నిజమైన వేటకొడవళ్లను పట్టుకుని ఓ పథకం ప్రకారం హత్య చేశారని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని సీసీ కెమెరాలో నమోదైన దృశ్యాల ఆధారంగా హంతకులను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నారు.



దుండగుల దాడిలో మరణించిన సోనై (ఫైల్‌ఫొటో)



నృత్యం చేస్తున్న హిజ్రాలు - పూజారితో తాళి కట్టించుకుంటున్న దృశ్యం




కూవాగం గ్రామంలో
హిజ్రాల సందడి

ప్యారీస్, ఏప్రిల్ 23: కళ్లకుర్చి జిల్లా ఉళుందూర్‌పేట సమీపంలోని హిజ్రాలు ఆరాధ్య దైవం కూత్తాండవర్ కొలువైన కూవాగం గ్రామంలో వార్షిక చిత్తిరై ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈనెల 9న మారియమ్మన్ ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం చిత్తిరై ఉత్సవాలు లాంఛనంగా ప్రారంభమయ్యాయి. సోమవారం సాయంత్రం స్తంభ స్థాపన కార్యక్రమంతో హిజ్రాలు మూడు రోజుల వేడుకలు మొదలయ్యాయి. మంగళవారం ఉదయం 7 గంటల నుంచి పొరుగూళ్లకు చెందిన హిజ్రాలు కూత్తాండవర్ ఆలయ పూజారులచే తాళి కట్టించుకున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి మిగతా హిజ్రాలు నవ వధువుల్లా సింగారించుకొని కూత్తాండవర్‌ను భక్తిశ్రద్ధలతో సేవించి ఆలయ ప్రధాన అర్చకులచే తమ మెడలో తాళి కట్టించుకున్నారు. అనంతరం వీరంతా ఆలయం ముందు, పరిసర ప్రాంతాల్లో ఆటపాటలు, నృత్యాలతో హోరెత్తించారు. బుధవారం చిత్తిరై రథోత్సవంలో పాల్గొనే హిజ్రాలు సాయంత్రం తాళి తెంచుకొని సమీపంలో ఉన్న బావి, చెరువుల వద్ద స్నానం చేసి తెల్లచీర ధరించి తమ సొంతూళ్లకు పయనమవుతున్నారు. కాగా, ఈ ఏడాది వేసవి తాపం అధికంగా ఉన్నప్పటికీ, దేశ, విదేశాల నుంచి సుమారు 10,000 మందికి పైగా కూవాగం ఉత్సవాలకు హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ రవాణా సంస్థలు విల్లుపురం, కళ్లకుర్చి ప్రాంతాల నుంచి కూవాగం వరకు ప్రత్యేక బస్సులు నడిపాయి. 25న విడయాత్తి ఉత్సవం, 26న ధర్మరాజు పట్టాభిషేకంతో చిత్తిరై ఉత్సవాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.

మాజీ డీజీపీ రాజేష్‌దాస్‌కు చుక్కెదురు

● **కోర్టులో లొంగిపోవాల్సిందే**



ప్యారీస్, ఏప్రిల్ 23: మహిళా ఎస్పీపై లైంగిక వేధింపులకు పాల్పడిన కేసులో మాజీ డీజీపీ రాజేష్‌దాస్ కోర్టులో లొంగిపోవాల్సిందేనంటూ మద్రాసు హైకోర్టు తేల్చిచెప్పింది. బాధిత మహిళా ఎస్పీ చేసి ఫిర్యాదు మేరకు నమోదైన కేసులో విధించిన మూడేళ్ల జైలుశిక్షను నిలిపివేయాలని, లొంగిపోవడం నుంచి మినహాయింపు కోరుతూ రాజేష్‌దాస్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. 2021వ సంవత్సరం మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి కాన్వాయ్‌లో భద్రతకు వెళ్లిన ఓ మహిళా ఎస్పీపై రాజేష్‌దాస్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారనే ఫిర్యాదుపై సీబీసీఐడీ విచారణ జరిపిన అనంతరం ఆయన సస్పెన్షన్‌కు గురయ్యారు. విల్లుపురం ప్రిన్సిపల్ కోర్టులో జరిగిన విచారణలో, రాజేష్‌దాస్‌ను ముద్దాయిగా ప్రకటించారు. ఈ కేసులో రాజేష్‌దాస్‌కు మూడేళ్ల జైలుశిక్ష విధిస్తూ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. అంతేకాకుండా, అప్పీలుకు నెలరోజులు గడువు కూడా ప్రకటించింది. అప్పీలుకు వెళ్లకుంటే న్యాయస్థానంలో లొంగిపోయి జైలుశిక్ష అనుభవించాలని న్యాయస్థానం ఆదేశాలు జారీచేసింది. ఈ తీర్పును వ్యతిరేకిస్తూ రాజేష్‌దాష్ తరఫున విల్లుపురం ప్రిన్సిపల్ కోర్టులో అప్పీలు పిటిషన్ వేయగా, గత ఫిబ్రవరి 12న జైలుశిక్ష ఖరారు చేస్తూ న్యాయస్థానం ఉత్తర్వులు జారీచేసింది. ఈ తీర్పు అనంతరం రాజేష్‌దాస్ తయ్యూరులో ఉన్న బంగ్లాకు తాళం వేసి అదృశ్యమయ్యారు. ఆయన తన సొంతూరు రాజస్థాన్‌కు పరారైనట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, రాజేష్‌దాస్ తరఫున మద్రాసు హైకోర్టులో జైలుశిక్ష నిలిపివేయాలి, కోర్టులో లొంగిపోవడానికి మినహాయింపు ఇవ్వాలని పిటిషన్ దాఖలైంది. మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి ఎం.దండపాణి సమక్షంలో విచారణకు రాగా, సీబీసీఐడీ తరఫున అడిషినల్ సొలిసిటల్ జనరల్ మునియప్పరాజ హాజరై... రాజేష్‌దాస్‌కు విధించిన శిక్షను అమలుపరచాలంటూ వాదించారు. ఇరుతరఫు వాదనల అనంతరం, రాజేష్‌దాస్ తరఫున దాఖలైన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

యువకుడి పరువు హత్య....
భార్య ఆత్మహత్య

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక పళ్ళికరణై ప్రాంతంలో గత ఫిబ్రవరిలో పరువు హత్యకు గురైన యువకుడి భార్య ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన తీవ్ర కలకలం సృష్టించింది. ఈ సంఘటనపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ హత్యకు గురైన యువకుడి తల్లిదండ్రులు యువతి కుటుంబీకుల నివాసగృహం ఎదుట ధర్నాకు దిగారు. పళ్ళికరణై అంబేడ్కర్ నగర్ వీధికి చెందిన ప్రవీణ్ (26) మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గత ఫిబ్రవరిలో కాల్‌సెంటర్‌లో ఉద్యోగంలో చేరాడు. ఆ సమయంలో పళ్ళికరణై సమీపం జల్లడియాన్ పేటకు చెందిన షర్మిల (22) అనే యువతితో పరిచయమైంది. ఆ పరిచయం కాస్త ప్రేమగా మారింది. ఇద్దరూ వేర్వేరు కులాలకు చెందినవారు కావడంతో యువతి తరఫు కుటుంబీకులు వీరి ప్రేమను వ్యతిరేకించడంతో గతేడాది ప్రేమికులిద్దరూ ఆదర్శవివాహం చేసుకున్నారు. ఎగ్మూరు సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ మేరేజీ చేసుకున్నారు. ఆ తర్వాత ప్రవీణ్‌తో కలిసి అతడి ఇంటిలో కాపురం ఉంటోంది. ఈ నేపథ్యంలో షర్మిల కుటుంబీకులు వారిపై కక్ష పెంచుకున్నారు. ప్రవీణ్‌ను హతమార్చేందుకు పథకం రూపొందించుకున్నారు. ఆ ప్రకారం గత ఫిబ్రవరి 23 రాత్రి పళ్ళికరణై టాస్మాక్ దుకాణం వద్ద నడిచివెళుతున్న ప్రవీణ్‌పై షర్మిల సోదరుడు దినేష్, అతడి స్నేహితులు నలుగురు కలసి వేటకొడవళ్లతో దాడి జరిపి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. పళ్ళికరణై పోలీసులు కేసు నమోదు చేసుకుని పరారీలో ఉండిన షర్మిల సోదరుడు దినేష్ (23), అతడి స్నేహితులు శ్రీరామ్ (18), జ్యోతిలింగం (25), విష్ణురాజ్ (25), స్టీఫెన్‌కుమార్ (24) అనే ఐదుగురిని అరెస్టు చేశారు. తన భర్త హత్యకు తల్లిదండ్రులు, సోదరుడే కారణమని తెలుసుకున్న షర్మిల అత్తవారింట ఎవరూ లేని సమయంలో ఈ నెల 14న ఉరివేసుకుని ఆత్మహత్యకు ప్రయత్నించింది. అత్తమామలు ఆమెను కాపాడి చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి షర్మిల కోమాలోనే ఉంది. చివరకు మంగళవారం వేకువజామున షర్మిల మృతి చెందింది. ఈ కేసులో పోలీసులు జరిపిన విచారణలో ఆత్మహత్య చేసుకోవడానికి ముందు షర్మిల రాసిన కొన్ని లేఖలను స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖల్లో తన ఆత్మహత్యకు తండ్రి దురైకుమార్, తల్లి సరళ, సోదరులు నరేష్, దినేష్ కారణమని ఆరోపించింది. తన కుటుంబీకులే భర్తను హతమార్చారని తెలుసుకుని దిగ్ర్భాంతి చెందానని, భర్త లేని జీవితం వ్యర్థమనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడుతున్నానని షర్మిల పేర్కొంది. ఆ లేఖల్లోని వివరాల ప్రకారం పళ్ళికరణై పోలీసులు విచారణ ప్రారంభించారు. ఇదిలా ఉండగా తమ కుమారుడి హత్యకు, షర్మిల ఆత్మహత్యకు కారకులైన ఆమె తల్లిదండ్రులు, సోదరులపై కఠిన చర్యలు చేపట్టాలని కోరుతూ ప్రవీణ్ తల్లిదండ్రులు షర్మిల కుటుంబీకుల ఇంటి ఎదుట మంగళవారం ధర్నాకు దిగటంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి., ఈ పరువు హత్యపై సీబీసీఐడీ విచారణకు ఆదేశించాలని, అప్పటివరకూ షర్మిల మృతదేహాన్ని తీసుకోబోమని ప్రకటించారు.



ప్రవీణ్, షర్మిల పెళ్ళినాటి ఫొటో

సమాచార ధ్వని

నేటినుంచి పాఠశాలలకు సెలవులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: రాష్ట్రంలోని పాఠశాలలకు బుధవారం నుంచి సెలవులు ప్రకటించారు. రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్, ప్లస్ వన్, ప్లస్ టూ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు ముగిశాయి. 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. బుధవారం నుంచి పాఠశాలలకు సెలవు ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల లెక్కింపు జరుగనున్న జూన్ 4వ తేది తర్వాత పాఠశాలల పునఃప్రారంభంపై ప్రభుత్వం అధికారికంగా ప్రకటిస్తుందని పాఠశాల విద్యాశాఖ అధికారులు తెలిపారు.

విద్యుత్ మీటర్ల కొనుగోలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: విద్యుత్ మీటర్లు, ట్రాన్స్‌పార్మర్లు కొనుగోలు చేయాలని విద్యుత్ బోర్డు నిర్ణయించింది. తరచూ మరమ్మతులకు గురికాకుండా ఉండేలా నాణ్యమైన పరికరాల కొనుగోలుకు ఈబీ చర్యలు చేపట్టింది. 'యూనిక్యూ ఐడెంటిఫికేషన్ నెంబర్' కలిగిన విద్యుత్ మీటర్లు కొనుగోలు చేయనుంది. మీటర్లలో క్యూ ఆర్ కోడ్ స్కాన్‌తో పాటు 16 డిజిట్ నెంబర్లుండగా, ట్రాన్స్‌పార్మర్లపై 15 నెంబర్లు, విద్యుత్ స్తంభాలకు 13 డిజిట్ నెంబర్లు ఉంటాయని అధికారులు తెలిపారు. త్వరలో 11.45 లక్షల విద్యుత్ మీటర్లు, 9,500 ట్రాన్స్‌పార్మర్లు కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించామని పేర్కొన్నారు.

నాణ్యత లేని 67 రకాల మందులు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: దగ్గు, జలుబు వంటి వాటిని వినియోగించే మందుల్లో 67 మందులు నాణ్యత లేనివని, మందుల నాణ్యత నిర్ధారణ బోర్డు తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న మందుల ఉత్పత్తి సంస్థలు, షాప్‌ల్లో తనిఖీలు నిర్వహించిన అధికారులు, 931 మందుల నమూనాలు పరిశోధించగా, 67 మందులు నాసిరకమని తెలిసింది. వీటిలో ఎక్కువగా పశ్చిమ బెంగాల్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాంఖ్ రాష్ట్రాల్లో తయారైనవని, దగ్గు, జలుబు, జీర్ణకోశ, ఇన్‌ఫెక్షన్, విటమిన్ లోపాలకు తీసుకొనే మందులని పేర్కొన్నారు. ఆ వివరాలు https://cdsco.gov.in/ అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

డీఈఓ పరీక్షా ఫలితాలు విడుదల

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: జిల్లా విద్యాధికారి (డీఈఓ) సహా మూడు పోస్టులకు నిర్వహించిన పరీక్షా ఫలితాలు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదలయ్యాయి. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలో 11 డీఈఓ పోస్టుల భర్తీకి గత ఏడాది నవంబరులో, గ్రూప్-7ఏ విభాగంలో కార్యాచరణ అధికారి గ్రేడ్-1 పోస్టుల భర్తీకి ఈ ఏడాది జనవరిలో పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షా ఫలితాలు, ఇతర వివరాలకు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

కేంద్ర వాటా విద్యుత్ 5,200 మెగావాట్లు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం తన వాటాగా రోజుకు 5,200 మెగావాట్ల విద్యుత్ కేటాయిస్తోంది. తమిళనాడు, ఆంధ్ర, తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల్లో థర్మల్, అణువిద్యుత్ కేంద్రాలున్నాయి. వాటిలో ఉత్పత్తయ్యే విద్యుత్ నుంచి రాష్ట్రానికి ప్రతి రోజు 7,171 మెగావాట్లు కేటాయించాల్సి ఉండగా, రోజుకు 5,000 నుంచి 5,500 మెగావాట్లు మాత్రమే సరఫరా అవుతోంది.

పోలింగ్ బూత్‌లు శుభ్రం చేయాలని ఉత్తర్వు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: పోలింగ్ బూత్‌లు శుభ్రం చేసి ఇవ్వాలని స్థానిక సంస్థలకు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సత్యప్రద సాహూ ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 19వ తేది జరిగిన లోక్‌సభ ఎన్నికలను పురస్కరించుకొని పోలింగ్ కోసం ప్రభుత్వ పాఠశాలల్లో 68,321 పోలింగ్ బూత్‌లు ఏర్పాటుచేశారు. ఒక్కో తరగతి గదులు, వెలుపల అంటించిన పోస్టర్లు, ఆహార పార్శిల్స్ వ్యర్థాలను తొలగించి శుభ్రం చేసినట్లు వీడియో తీసి పంపించాలని స్థానిక సంస్థలకు ఉత్తర్వులు జారీచేశారు.

చెన్నై-బిట్రగుంట సహా 15 రైళ్లు రద్దు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: రైల్వే మార్గం అభివృద్ధి పనుల కారణంగా చెన్నై-బిట్రగుంట సహా 15 ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేస్తున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఆంధ్ర రాష్ట్రం విజయవాడ-ఖాజీపేట మధ్య మూడో కొత్త మార్గం పనులు ముగింపు దశకు చేరుకున్నాయి. ఈ మార్గంలో వెళ్లే రైళ్ల సేవల్లో మార్పులు చేపట్టారు. చెన్నై సెంట్రల్-బిట్రగుంట ప్రతిరోజు సాయంత్రం 4.30 గంటల ఎక్స్‌ప్రెస్ రైలు, అలాగే, బిట్రగుంట-చెన్నై సెంట్రల్ తెల్లవారుజామున 4.45 గంటల ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 26వ తేదీ వరకు రద్దు చేశారు. సెంట్రల్- బర్మర్, కేఎస్ఆర్ బెంగుళూరు-ధాన్పూర్, కన్నియాకుమారి-హజ్రత్ నిజాముద్దీన్, తిరువనంతపురం-హజ్రత్ నిజాముద్దీన్ సహా 15 ప్రత్యేక రైళ్ల సేవలు రద్దు చేశారు.

తాంబరం-బిహార్ ప్రత్యేక రైలు

ఐసిఎఫ్,ఏప్రిల్23:ప్రయాణికుల సౌకర్యార్థం తాంబరం-బిహార్ ప్రత్యేక రైలు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది. తాంబరం నుంచి ఈనెల 25,మే 2,9,16,23, 30, జూన్ 6,13,20,27 తేదీల్లో సాయంత్రం 6.15 గంటలకు బయల్దేరి మూడవ రోజు మధ్యాహ్నం 1.55 గంటలకు బిహార్ చేరుకుంటుంది. అక్కడి నుంచి ఈ నెల 27, మే 4,11,18,25, జూన్ 1,8,15, 22,29 తేదీల్లో రాత్రి 11.55 గంటలకు బయల్దేరి మూడవ రోజు రాత్రి 10.45 గంటలకు తాంబరం చేరుకుంటుంది.

ఆరు నెలల్లో బీచ్ స్టేషన్ పనుల పూర్తి

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: చెన్నై బీచ్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు ఆరు నెలల్లో పూర్తవుతాయని చెన్నై రైల్వే డివిజన్ అధికారులు తెలిపారు. ఈ డివిజన్ పరిధిలో అమృత్ భారత్ పథకం కింద పెరంబూర్, తిరువళ్లూర్, అరక్కోణం సహా 15 రైల్వేస్టేషన్లు అభివృద్ధి చేయనున్నారు. రూ.14.58 కోట్లతో జరుగుతున్న బీచ్ రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులు 50 శాతం ముగిశాయని, మరో ఆరు నెలల్లో మిగిలిన పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు.

రేపటి నుంచి ఐపీఎల్ టిక్కెట్ల విక్రయం

పెరంబూర్, ఏప్రిల్ 23: ఐపీఎల్ పోటీల్లో భాగంగా స్థానిక చేపాక్కం క్రికెట్ స్టేడియంలో ఈ నెల 28వ తేది చెన్నై సూపర్ కింగ్స్-సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్ టిక్కెట్ల విక్రయాలు గురువారం (ఈనెల 25వ తేది) ఉదయం 10.40 గంటలకు ఆన్‌లైన్‌లో ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు.

బేకరీ వస్తువుల తయారీపై శిక్షణ

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: బేకరీ వస్తువుల తయారీపై శిక్షణ ఈకాట్టుతాంగల్ సిడ్కో ఎస్టేట్‌లో బుధవారం నుంచి ఈ నెల 26వ తేది వరకు జరుగనుంది. ఈ శిబిరంలో బేకరీ వస్తువుల మూల పదార్థాలు, ఉపకరణాలు, వినియోగించే యంత్రాలు వంటి ఉంటాయి. కరాచీ బిస్కెట్, బన్ను, స్వీట్ రకాల తయారీపై నిపుణులు శిక్షణ ఇవ్వనున్నారు. టెన్త్ ఉత్తీర్ణులై 18 ఏళ్ల పైబడిన మహిళలు, పురుషులు శిక్షణలో పాల్గొనవచ్చు. వివరాలకు 8668102600, 7010143022 అనే ఫోను నెంబర్లలో సంప్రదించవచ్చు.

సారంగపాణి ఆలయ వేడుకల్లో అపశృతి

● గుంతలో చిక్కుకున్న రథ చక్రం



గుంతల్లో చిక్కుకున్న రథం - ప్రొక్లెయిన్ సాయంతో చక్రం వెలికితీస్తున్న దృశ్యం

పెరంబూర్, ఏప్రిల్ 23: కుంభకోణం సారంగపాణి ఆలయ వేడుకల్లో అపశృతి చోటుచేసుకుంది. వేడుకల్లో భాగంగా మంగళవారం ఉదయం 7.05 గంటలకు రథోత్సవం ప్రారంభం కాగా, వేలాది మంది భక్తులు పాల్గొని రథం లాగారు. 10.30 గంటల సమయంలో దక్షిణ వీధిలో వస్తుండగా రథం ఎడమవైపు చక్రం హఠాత్తుగా ఐదడుగుల గుంతలో చిక్కుకుంది. దీంతో సిబ్బంది గుంతలో రాళ్లు, ఇసుక వేసి రథం చక్రాన్ని బయటకు తీసారు.. ఈ ప్రాంతం లో కొద్దిరోజుల క్రితం తాగు నీటి పైప్‌లైన్ కోసం గుంత తీసి, పనులు ముగిసిన తర్వాత పూడ్చివేసినట్లు తెలిసింది. కానీ, గుంత సక్రమంగా పూడ్చని కారణంగా రథ చక్రం గుంతలో చిక్కుకుందని స్థానికులు తెలిపారు. ప్రొక్లెయిన్ సాయంతో రథం చక్రం వెలికితీసిన అనంతరం సుమారు రెండు గంటల ఆలస్యంగా రథోత్సవం యధావిధిగా సాగింది.

వైభవంగా వరమ్ విద్యాశ్రమ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎస్ఆర్కే అప్పు

వేలూరు, ఏప్రిల్ 23: స్థానిక కాట్పాడి సెంగుట్టైలోని వరమ్ విద్యాశ్రమం వార్షికోత్సవం మంగళవారం జరిగింది. వేడుకలకు ముఖ్యఅతిథిగా అన్నాడీఎంకే వేలూరు కార్పొరేషన్ జిల్లా సెక్రటరీ ఎస్ఆర్కే అప్పు, నిర్వాహక డైరెక్టర్ మదివానన్ పాల్గొన్నారు. గౌరవ అతిథిగా పాపిన్స్ ప్రీ స్కూల్ స్థాపకులు, లారీనా ఇంటర్నేషనల్ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాంబిక, పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ గోపినాథ్, వండ్రన్‌తాంగల్ పంచాయతీ యూనియన్ అధ్యక్షుడు రాకేష్, డీఎంకే జనరల్ కమిటీ సభ్యులు లోకనాధన్, అన్బు, కాట్పాడి 4 వార్డు కౌన్సిలర్ చిత్ర, మేటుకలమ్ కౌన్సిలర్ భక్తా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేలూరులో 42 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రతలు



వేలూరు, ఏప్రిల్ 23: జిల్లాలో ఎండ తీవ్రత అధికం కావడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 8 గంటల నుంచే ఎండ తీవ్రత ప్రారంభమై సాయంత్రం 4 గంటల వరకు తగ్గడం లేదు. దీంతో ప్రజలు సేదతీరేందుకు పుచ్చకాయలు, శీతల పానీయాలు, చెరకు రసం, కొబ్బరి నీళ్లు సేవిస్తున్నారు. రోడ్లపై వెళుతున్న వారు ఎండ వేడి నుంచి తప్పించుకొనేలా గొడుగులు, టోపీలు వేసుకొని వెళ్తున్నారు. అదే సమయంలో పిల్లలు, వృద్ధులు ఎండల్లో తిరగరాదని ఆరోగ్యశాఖ అధికారులు సూచిస్తున్నారు. గురువారం వేలూరులో 41.7 డిగ్రీలు, తిరుపత్తూర్, రాణిపేట, అరక్కోణం జిల్లాల్లో 37.7 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైనట్లు అధికారులు తెలిపారు.

కృత్రిమంగా పండిస్తున్న మామిడి, అరటి పండ్లు స్వాధీనం



అరటిపండ్లను పరిశీలిస్తున్న అధికారులు

పెరంబూర్, ఏప్రిల్ 23: స్థానిక కోయంబేడు మార్కెట్లో రసాయనాలతో మగ్గిస్తున్న 7 టన్నుల మామిడి. అరటి పండ్లను ఆహార భద్రతా శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. చెన్నై మండల ఆహార భద్రతా శాఖ అధికారి డా.సతీష్‌కుమార్ ఉత్తర్వులతో, కోయంబేడు ఆహార భద్రతా శాఖ అధికారి సత్యమూర్తి నేతృత్వంలోని సిబ్బంది మంగళవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి మార్కెట్లోని దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. సుమారు వంద దుకాణాల్లో తనిఖీలు చేపట్టి రసాయనాలతో పండిస్తున్న 4 టన్నుల మామిడి, 3 టన్నుల అరటి పండ్లు స్వాధీనం చేసుకొని, ఈ చర్యలకు పాల్పడుతున్న 50 దుకాణాల యజమానులకు జరిమానా విధించారు.

రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు 5,637 మంది

పెరంబూర్, ఏప్రిల్ 23: తమిళనాడు హజ్ కమిటీ ఆధ్వర్యంలో హజ్ యాత్రకు వెళ్లే భక్తులకు మార్గదర్శకాలు తెలిపే ప్రత్యేక శిబిరం సోమవారం తిరుచ్చిలో జరిగింది. ఈ శిబిరంలో తిరుచ్చి, అరియలూరు, పెరంబలూరు, పుదుకోట తదితర జిల్లాలకు చెందిన హజ్ యాత్ర భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమిళనాడు హజ్ కమిటీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అబ్దుల్ సమద్ మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రం నుంచి గత ఏడాది 4,034 మంది హజ్ యాత్రకు వెళ్లగా, ఈ ఏడాది 5,637 మంది పేర్లు నమోదుచేసుకున్నారని తెలిపారు. ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశముందన్నారు. వీరికి విమాన ఛార్జీలు, బస, భోజనం తదితరాలకు రూ.3.5 లక్షలు ఖర్చవుతుండగా, రాష్ట్రప్రభుత్వం రాయితీ, సబ్సిడీగా రూ.25,000 అందజేస్తుందని తెలిపారు. ఈ నెల 26 నుంచి జూన్ 9వ తేదీ వరకు 17 విడతలుగా హజ్ యాత్రికులను విమానాల ద్వారా పంపనున్నామని ఆయన తెలిపారు.

మార్కుల సమన్వయ విధానం 'నెట్, క్యూట్' పరీక్షల్లో రద్దు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: నెట్, క్యూట్ పరీక్షల్లో మార్కుల సమన్వయ విధానం రద్దు చేస్తున్నట్లు యూజీసీ అధ్యక్షుడు జగదీష్‌కుమార్ తెలిపారు. కేంద్ర విశ్వవిద్యాలయాల డిగ్రీ కోర్సుల్లో చేరేందుకు 'క్యూట్', అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 'నెట్' ప్రవేశ పరీక్షలు జాతీయస్థాయిలో నిర్వహిస్తున్నారు. పలువిడతలుగా పరీక్షలను యూజీసీ నిర్వహిస్తోంది. ఒక పాఠ్యాంశానికి ఒకరోజు పైగా రాష్ట్రాల వారీగా విభజించి పరీక్షలు నిర్వహించడమే కాకుండా వివిధ రకాల ప్రశ్నపత్రాలు విడుదల చేస్తోంది. కఠినతరమైన, సులభతరమైన ప్రశ్నలుండడంతో అభ్యర్థులకు సమానమైన అర్హత నిర్ణయించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో, వచ్చే విద్యా సంవత్సరం రెండు పరీక్షల్లో ఒకేరోజు ఒకేరకమైన ప్రశ్నాపత్రంతో సమన్వయ మార్కుల విధానాన్ని ప్రవేశపెట్టనున్నారు.

గ్రూప్-1 పోస్టుల అభ్యర్థుల తుది జాబితా విడుదల

వేళచ్చేరి, ఏప్రిల్ 23: డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, వాణిజ్యపన్ను డిప్యూటీ కమిషనర్ తదితర గ్రూప్-1 పోస్టుల్లో ఖాళీగా ఉన్న 95 పోస్టుల భర్తీకి రాత పరీక్ష ముగిసిన అనంతరం ఈ నెల 12వ తేది ఇంటర్వ్యూలు జరిగాయి. ఈ ఇంటర్వ్యూలో పొందిన మార్కులు, రిజర్వేషన్ తదితరాల ప్రాతిపదికన ఎంపిక చేసిన అభ్యర్థుల తుది జాబితా టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. ఆ ప్రకారం, 21 డిప్యూటీ కలెక్టర్లు, 25 డిప్యూటీ పోలీసు సూపరింటెండెంట్లు, 25 సహాయ కమిషనర్, సహకార సంఘాల సబ్ రిజిస్ట్రార్లు 13, గ్రామీణాభివృద్ధి డిప్యూటీ డైరెక్టర్ 7 పోస్టులు, జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి మూడు పోస్టులు మొత్తం 94 పోస్టులకు ఎంపిక అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ తెలిపింది.

చెంగల్పట్టు కోర్టులో నటి యాషికా హాజరు

ప్యారీస్, ఏప్రిల్ 23: రోడ్డు ప్రమాదం కేసుకు సంబంధించి నటి యాషికా మంగళవారం చెంగల్పట్టు కోర్టులో విచారణకు హాజరయ్యారు. 2021వ సంవత్సరం జూలైలో పుదుచ్చేరి నుంచి చెన్నై వస్తుండగా యాషికా ఆనంద్ నడిపిన కారు మహాబలిపురం సమీపంలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో యాషికాతో ప్రయాణం చేసిన ఏపీకి చెందిన భవాని శెట్టి మృతిచెందింది. ఈ కేసు చెంగల్పట్టు జిల్లా ప్రిన్సిపల్ కోర్టులో మంగళవారం విచారణకు రాగా యాషికా హాజరయ్యారు. విచారణ జరిపిన న్యాయమూర్తి, వచ్చే మే 3వ తేది మళ్లీ విచారణకు హాజరుకావాలని ఉత్తర్వులు జారీచేశారు.

వేసవి వ్యాధులను ఎదుర్కొనేందుకు సన్నాహాలు

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: వేసవిలో వాతావరణ మార్పుల కారణంగా వ్యాపించే వ్యాధులు ఎదుర్కొనేందుకు ఆరోగ్యశాఖ సన్నద్ధమైంది. వెరిసెల్ల వైరస్ కారణంగా చికెన్ ఫాక్స్, గవద బిళ్లలు వంటి వ్యాధులు వ్యాపిస్తాయి. ప్రస్తుతం కేరళలో హెచ్5ఎన్1 వైరస్‌తో బర్డ్ ఫ్లూ వ్యాపించి ఉంది. ఈ వ్యాధి రాష్ట్రంలో వ్యాపించే అవకాశముండడంతో ముందు జాగ్రత్త చర్యలు చేపట్టారు. పేరాసిటామల్, అసిత్రోమైసిన్, ఓఆర్ఎస్ ఉప్పు, చక్కెర మిశ్రమం అనే మూడు మందులను సిద్ధంగా ఉంచారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వారు వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు.

సైన్స్ ఇయక్కం ఆధ్వర్యంలో ప్రపంచ పుస్తక దినోత్సవం



వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

వేలూరు, ఏప్రిల్ 23: తమిళనాడు సైన్స్ ఇయక్కం వేలూరు జిల్లా కాట్పాడి యూనియన్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. స్థానిక చిత్తూరు బస్టాండ్ సమీపంలోని నారాయణ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు తంగవేలు అధ్యక్షత వహించారు. తమిళనాడు సైన్స్ ఇయక్కం యూనియన్ సెక్రటరీ రాధాకృష్ణన్ ఆహ్వానం పలుకగా, ఆపిల్ లయన్స్ క్లబ్ సెక్రటరీ రవికుమార్, కరిగిరి ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పళని తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న సైన్స్ ఇయక్కం జిల్లా సెక్రటరీ జనార్ధనన్ మాట్లాడుతూ... 1995వ సంవత్సరం నుంచి ప్రపంచ పుస్తక వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా మహిళలకు పుస్తకాలు అందజేశారు. సైన్స్ ఇయక్కం యూనియన్ జాయింట్ కోశాధికారి ఈశ్వరి వందన సమర్పణతో వేడుకలు ముగిశాయి.

బాలికకు వివాహం

● తల్లిదండ్రులు సహా ఐదుగురిపై కేసు

ప్యారీస్, ఏప్రిల్ 23: పదహారేళ్ల బాలికకు వివాహం జరిపించిన తల్లిదండ్రులు సహా ఐదుగురిపై పోలీసులు కేసు నమోదుచేశారు. తిరువణ్ణామలై జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన పదహారేళ్ల బాలిక తనతో పాటు ప్లస్ వన్ చదువుకుంటున్న విద్యార్థిని ప్రేమించినట్లు తెలిసింది. ఈ విషయం తెలిసిన బాలిక తండ్రి, స్థానిక వ్యాసర్పాడిలో ఉన్న తన సోదరి ఇంటికి ఈ నెల 13న తీసుకెళ్లి అక్క కుమారుడు (26)తో 15వ తేది నిర్బంధ వివాహం జరిపించారు. అయితే ఈ వివాహాన్ని వ్యతిరేకించి బాలిక ఇచ్చిన ఫిర్యాదుమేరకు చిన్నారుల సంరక్షణ కేంద్రం అధికారి స్టెల్లా వెళ్లి విచారణ జరిపి, ఎంకేబీ నగర్ మహిళా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. దీంతో బాలిక తల్లిదండ్రులు సహా ఐదుగురిపై కేసు నమోదైంది.

గూండా చట్టం కింద 109 మంది అరెస్ట్

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: నగరంలో గూండా చట్టం కింద 109 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. వరుసగా నేరాలకు పాల్పడే వారిని గూండా చట్టంలో అరెస్ట్ చేయాలని కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు గడిచిన 21 రోజుల్లో ఇద్దరు మహిళలు సహా 109 మందిని గూండా చట్టం కింద పోలీసులు అరెస్ట్ చేశారు.

సెంట్రల్ స్టేషన్‌లో మహిళ అనుమానాస్పద మృతి

పెరంబూర్, ఏప్రిల్ 23: స్థానిక సెంట్రల్ రైల్వేస్టేషన్‌లో మహిళా అనుమానాస్పదంగా మృతిచెందిన వ్యవహారంపై పోలీసులు విచారిస్తున్నారు. ఈ స్టేషన్ నుంచి ప్రతిరోజు ఉత్తరాది రాష్ట్రాల ప్రజలు రాకపోకలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో, రైల్వే స్టేషన్ మొదటి ప్లాట్ ఫారం సమీపంలోని గది శుభ్రం చేసేందుకు వచ్చిన కార్మికులు, ఆ ప్రాంతంలో 25 ఏళ్ల ఉత్తరాది మహిళ మృతిచెంది ఉండడం గమనించిన రైల్వే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజీవ్ గాంధీ ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదుచేసి, మహిళది హత్యా? ఆత్మహత్యా? అనే కోణాల్లో విచారణ చేపట్టారు.

వెల్లయంగిరికి వెళ్లిన యువకుడి మృతి

ఐసిఎఫ్, ఏప్రిల్ 23: వెల్లయంగిరి ఏడవ కొండపై నుంచి జారిపడిన తిరుప్పూర్‌కు చెందిన వీరకుమార్ మృతిచెందిన ఘటన విషాదానికి దారితీసింది. వెల్లయంగిరి కొండ కింది భాగం నుంచి 5.5 కి.మీ కొండ పైకి వెళ్లి శివపెరుమాళ్‌ను దర్శించుకోవచ్చు. ఈ కొండ ఆలయానికి వెళ్లాలంటే ఏడు కొండలు దాటాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో, వెల్లయంగిరి ఏడో కొండపై వెళ్తున్న తిరుప్పూర్‌కు చెందిన వీరకుమార్ హఠాత్తుగా కాలు జారి కిందపడిపోయాడు. అటవీ సిబ్బంది అతనిని వెంటనే రక్షించి ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్సలు ఫలించక వీరకుమార్ మృతిచెందాడు. కాగా, వెల్లయంగిరి కొండకు వెళ్లి రెండు నెలల్లో 8 మంది మృతిచెందారు.

నకిలీ నోట్ల చెలామణి కేసులో ఏడేళ్ల జైలు

పెరంబూర్, ఏప్రిల్ 23: తెన్‌కాశి జిల్లా వీకే పుదూర్ ప్రాంతంలో 2016లో పోలీసులు వాహనతనిఖీ చేస్తున్న సమయంలో నకిలీ నోట్లతో వెళ్తున్న వారిని అరెస్టు చేశారు. ఈ కేసు విచారణ తెన్‌కాశి అడిషినల్ మేజిస్ట్రేట్ కోర్టులో విచారణ జరుగుతోంది. ఈ కేసు విచారణ ముగియడంతో, నిందితులైన నకిలీ నోట్లు తీసుకెళ్తున్న ఏజెంట్లు అయ్యప్పన్, సేర్మలింగం, మోజస్ రాజ్‌కుమార్, మణకంఠన్, వీరపాండ్యన్, రాజేంద్రన్‌లకు తలా ఏడేళ్ల కారాగారశిక్ష విధిస్తూ న్యాయమూర్తి మారీశ్వరి మంగళవారం తీర్పు వెలువరించారు.

న్యాయవాది ఇంటిపై పెట్రో బాంబు దాడి

ప్యారీస్, ఏప్రిల్ 23: తూత్తుకుడి జిల్లా కోవిల్‌పట్టి రాజీవ్‌గాంధీ నగర్‌లో ఉన్న ఓ న్యాయవాది ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ బాంబుతో దాడిచేయడంతో పాటు లోడు ఆటోకు నిప్పంటించి పరారయ్యారు. మారిసెల్వం అనే న్యాయవాది ఇటీవల ఊత్తుపట్టిలో ఉన్న తన గార్డెన్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారు. ఇందుకోసం ఇటుక, ఇసుక తదితర సామగ్రి తరలించేందుకు ఓ ఆటో అద్దెకు మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంలో బైక్‌లో వెళ్లిన గుర్తుతెలియని వ్యక్తులు ఆయన ఇంటిపై పెట్రోల్ బాంబుతో దాడిచేసి ఇంటి ముందు నిలిపివున్న ఆటోకు నిప్పంటించి అక్కడ నుంచి పరారయ్యారు. దీనిపై మారిసెల్వం అందజేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు, పరారైన ముఠా కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

తేనెటీగల దాడి: 30 మంది గాయాలు

పెరంబూర్, ఏప్రిల్ 23: విల్లుపురం కోర్టు సముదాయంలో తేనెటీగల దాడిలో 30 మంది గాయపడ్డారు. చెన్నై-తిరుచ్చి జాతీయ రహదారి సమీపంలోని దిండివనంలో ఉన్న ఈ కోర్టు ప్రాంగణంలో మంగళవారం న్యాయవాదులు, కోర్టు సిబ్బంది, సాక్షులు పెద్దసంఖ్యలో ఉన్నారు. ఈ క్రమంలో, కోర్టు సమీపంలోని చెరువు గట్టుపై ఉన్న చెట్టు నుంచి తేనెటీగలు ఒక్కసారిగా కోర్టు ప్రాంగణంలో చొరబడ్డాయి. వాటిని చూసి అక్కడున్న వారు పరుగులు తీయగా, తేనేటీగల దాడిలో 30 మందికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని దిండివనం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆకతాయిలు ఎవరో చెట్టుపై ఉన్న తేనెతెట్టుపై రాయి విసిరన కారణంగా తేనెటీగలు కోర్టు ప్రాంగణంలో ప్రవేశించి ఉంటాయని సిబ్బంది పేర్కొంటున్నారు.

గంజాయి విక్రయిస్తున్న మాజీ వీఏఓ అరెస్ట్

పెరంబూర్, ఏప్రిల్ 23: పుదుకోట సమీపంలో గంజాయి విక్రయిస్తున్న మాజీ వీఏఓను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టిన పోలీసులు, గంజాయి విక్రయిస్తున్న మాజీ గ్రామ నిర్వహణ అధికారి విజయా వర్మ, ఆయన స్నేహితుడు బాలసుబ్రమణియన్‌లను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

బస్సులకు ఆటోమేటిక్ తలుపులు

● హైకోర్టు మదురై బెంచ్

పెరంబూర్, ఏప్రిల్ 23: బస్సుల్లో ఫుట్‌బోర్డు ప్రయాణాలను అరికట్టేందుకు ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటుచేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మదురై డివిజన్ బెంచ్ ఉత్తర్వులు జారీచేసింది. బస్సుల ఫుట్‌బోర్డులపై విద్యార్థులు, యువకులు ప్రయాణించడంపై హైకోర్టు మదురై బెంచ్ సుమోటాగా కేసు నమోదుచేసి విచారిస్తోంది. ఈ కేసు మంగళవారం విచారణకు వచ్చింది. అదనపు బస్సులు ఏర్పాటు చేసినా విద్యార్థులు, యువకులు ఫుట్ బోర్డుపై ప్రయాణించడాన్ని అడ్డుకోలేకపోతున్నారన్నారు. కొద్ది సార్లు డ్రైవర్లు, కండక్టర్లతో విద్యార్థులు ఘర్షణలకు దిగిన సందర్భాలున్నాయన్నారు. ప్రస్తుతం నడుపుతున్న బస్సుల్లో ఎన్ని బస్సులకు ఆటోమేటిక్ తలుపులున్నాయని, ఎన్ని బస్సులకు లేవు అనే వివరాలు తెలియజేయాలని హోంశాఖ, రవాణా శాఖ కార్యదర్శులకు హైకోర్టు మదురై బెంచ్ నోటీసులు జారీచేసింది.

నా విజయం తథ్యం : ఓపీఎస్

పెరంబూర్, ఏప్రిల్ 23: రామనాథపురం నియోజకవర్గంలో తన విజయం ప్రకాశవంతంగా ఉందని మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వం ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన మంగళవారం మీడియాతో మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలు తనను ఆదరించారని తెలిపారు. తాను ప్రచారానికి వెళ్లిన ప్రతిచోట ప్రజలు సాదరంగా ఆహ్వానించారని తెలిపారు. 10 ఏళ్లుగా ప్రధాని మోదీ మంచి పాలన అందించారని, ఆయన పాలనలో మైనార్టీలకు ఎలాంటి ఇబ్బందులు కలుగలేదని ఓపీఎస్ తెలిపారు.

ఆలయ వేడుకలకు భద్రత కల్పించాలి

● డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత

పెరంబూర్, ఏప్రిల్ 23: ఆలయాల వేడుకలో అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టాలని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత విజయకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆమె విడుదల చేసిన ప్రకటనలో... చిత్తిరై మాసం కావడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రసిద్ధిచెందిన ఆలయాలు సహా అన్ని ఆలయాల్లో ఉత్సవాలు నిర్వహిస్తుండగా, లక్షలాది మంది భక్తులు హాజరవుతున్నారన్నారు. ఈ ఉత్సవాల్లో విద్యుత్ స్తంభాలకు రథాలు తగలడం, గుంతల్లో రథం చక్రాలు ఇరుక్కుపోవడంతో వంటి ఘటనలు చోటుచేసుకోవడంతో భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఆలయ వేడుకల్లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత శాఖ అధికారులు వేడుకల ఏర్పాట్లను ముందుగానే పర్యవేక్షించేలా చర్యలు చేపట్టాలని ప్రేమలత డిమాండ్ చేశారు.

మోదీపై కేసు నమోదుచేయాలి

● డీకే నేత వీరమణి

పెరంబూర్, ఏప్రిల్ 23: ముస్లింలపై విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రచారం చేస్తున్న ప్రధాని మోదీపై కేసు నమోదుచేయాలని ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఎన్నికల ప్రచారంలో మతం, దేవుళ్లను వినియోగించడం ఎన్నికల చట్టం ప్రకారం నేరమని అన్నారు. అలాంటి ప్రచారాలు పాల్పడే వారి విజయం చెల్లదని పలు కేసుల్లో న్యాయస్థానాలు తీర్పులు చెప్పాని తెలిపారు. ఈ నేపథ్యంలో, ఇటీవల ప్రధాని మోదీ ఎన్నికల ప్రచారంలో మైనార్టీలపై విద్వేషాలు రెచ్చగొట్టేలా ప్రసంగించారని, ఈ వ్యవహారంలో మోదీపై తీసుకున్న చర్యలేంటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలన్నారు. అలాగే, మోదీపై కోర్టు స్వచ్ఛంధంగా కేసు నమోదుచేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ప్రధాని ప్రసంగాన్ని ఖండిస్తున్నాం

● మాజీ మంత్రి డి.జయకుమార్

పెరంబూర్, ఏప్రిల్ 23: ఎన్నికల ప్రచార సభలో ప్రధాని నరేంద్ర మోదీ చేసిన మత విద్వేష ప్రసంగాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నాడీఎంకే నేత, మాజీ మంత్రి డి.జయకుమార్ తెలిపారు. నగరంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ... లోక్‌సభ ఎన్నికల్లో వంద శాతం పోలింగ్‌కు కృషిచేస్తున్నట్లు చెబుతున్న ఎన్నికల కమిషన్, మరోవైపు పోలింగ్ శాతం తగ్గేందుకు కారణమైందా అనే అనుమానం కలుగుతుందన్నారు. ఓటర్ల గుర్తింపుకార్డులున్న వారి పేరు కూడా ఓటరు జాబితాలో లేవని, పోలింగ్ కేంద్రాలకు వెళ్లిన అనేక మంది పేరు లేకపోవడంతో నిరాశగా వెనుదిరిగారన్నారు.

రైలు ప్రయాణికులకు తక్కువ ధరకు టిఫిన్, భోజనం



పెరంబూర్, ఏప్రిల్ 23: అన్ రిజర్వ్‌డ్ బోగీల్లో ప్రయాణించే వారికి తక్కువ ధరతో టిఫిన్, భోజనం అందించేలా స్టాల్స్ ఏర్పాటుచేశారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్ట్ రైళ్లలో అన్‌రిజర్వ్‌డ్ బోగీలు ముందు, వెనుక ఉండడంతో వాటిలో ప్రయాణం చేసే వారికి సక్రమంగా టిఫిన్, భోజనం అందడం లేదన్నారు. ఈ విషయంపై దృష్టి సారించి అలాంటి ప్రయాణికుల కోసం ప్రత్యేక స్టాల్స్ ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. చెన్నై డివిజన్‌లో ఐదు ప్రధాన స్టేషన్లు, తిరుచ్చి డివిజన్‌లో 3, సేలం డివిజన్‌లో 2, పాలక్కాడు డివిజన్‌లో 9, తిరువనంతపురం డివిజన్‌లో 11 రైల్వేస్టేషన్లలో ఈ స్టాల్స్ ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ స్టాల్స్‌లో 175 గ్రాముల పూరి బాజీ రూ.20, పెరుగు, పులిహోర 200 గ్రాములు రూ.20, వెరైటీ రైస్ 350 గ్రాములు రూ.50, సీల్డ్ వాటర్ గ్లాస్ 200 ఎం.ఎల్ రూ.3కు విక్రయిస్తున్నట్లు దక్షిణ రైల్వే తెలిపింది.

మే మొదటి వారంలో ఇంజనీరింగ్ కోర్సుల దరఖాస్తు స్వీకరణ

పెరంబూర్, ఏప్రిల్ 23: బీఈ, బీటెక్ కోర్సులకు సంబంధించి మొదటి సంవత్సరం అడ్మిషన్లకు దరఖాస్తు స్వీకరణ మే మొదటి వారంలో ప్రారంభం కానున్నట్లు సమాచారం. రాష్ట్రంలో ప్లస్ టూ ఫలితాలు మే 6వ తేది వెలువరించనుండగా, అందుకు రెండు రోజుల ముందుగా బీఈ, బీటెక్ దరఖాస్తు స్వీకరణ ప్రారంభించాలని నిర్ణయించారు. దరఖాస్తుల స్వీకరణ, కౌన్సిలింగ్ తదితరాలకు సంబంధించి మరో రెండు రోజుల్లో అధికారపూర్వక ప్రకటన విడుదల కానుంది.

రాష్ట్ర భాషలో సివిల్ సర్వీసెస్ పరీక్షల ప్రశ్నపత్రం

● కేంద్రానికి హైకోర్టు సూచన

పెరంబూర్, ఏప్రిల్ 23: ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షల ప్రశ్నాపత్రాలు రాష్ట్ర భాషల్లో ఉండేలా పరిశీలించాలని మద్రాసు హైకోర్టు కేంద్ర ప్రభుత్వానికి సూచించింది. సివిల్ సర్వీస్ పరీక్షల ప్రశ్నాపత్రాలు 22 రాష్ట్ర భాషల్లో నిర్వహించాలని కోరుతూ బాలమురుగన్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.ఈపిటిషన్ మంగళవారం విచారణకు వచ్చింది. ఈ కేసు విచారించిన హైకోర్టు... ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షలకు సంబంధించిన ప్రశ్నాపత్రాలు రాష్ట్ర భాషల్లో అందించేవిషయం పరిశీలించాలని కేంద్రానికి సూచించడంతో పాటు ఏఐ టెక్నాలజీ ద్వారా అనువాదం చేసే అంశం పరిశీలించాలని సూచించింది.

ప్రయాగరాజ్-బెంగళూరు ప్రత్యేక రైళ్లు

వేళచ్చేరి, ఏప్రిల్ 23: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ప్రయాగరాజ్- బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడుపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.04131 ప్రయాగరాజ్-బెంగళూరు ప్రత్యేకరైలు ఈనెల 28, మే 5,12,19,26, జూన్ 2,9,16,23,30 తేదీల్లో ప్రయాగరాజ్‌లో రాత్రి 11.30 గంటలకు బయల్దేరి మూడో రోజు సాయంత్రం 6.30 గంటలకు బెంగళూరు చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.04132 బెంగళూరు-ప్రయాగరాజ్ ప్రత్యేక రైలు ఈ నెల 24, మే 1,8,15,22,29, జూన్ 5,12,19,26 తేదీల్లో బెంగళూరులో ఉదయం 7.10 గంటలకు బయల్దేరి మరుసటిరోజు రాత్రి 10.50 గంటలకు ప్రయాగరాజ్ చేరుకుంటుంది. ఈ రైళ్లు జోలార్‌పేట, కాట్పాడి, పెరంబూర్, నెల్లూరు, ఒంగోలు, చీరాల, విజయవాడ, ఖమ్మం, వరంగల్ మీదుగా వెళ్లనున్నాయి.

కళాక్షేత్ర మాజీ ప్రొఫెసర్ అరెస్ట్

వేళచ్చేరి, ఏప్రిల్ 23: స్థానిక కళాక్షేత్ర కళాశాల మాజీ విద్యార్థిని చేసిన ఫిర్యాదు మేరకు మాజీ ప్రొఫెసర్ శ్రీజిత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. 15 ఏళ్ల క్రితం తనను శ్రీజిత్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్న బాధిత విద్యార్థిని ఫిర్యాదు చేశారు. ఆ విద్యార్థిని అడయార్ మహిళా పోలీసులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణ జరిపిన నేపథ్యంలో, మంగళవారం మాజీ ప్రొఫెసర్ శ్రీజిత్‌ను అరెస్ట్ చేశారు.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు... నిందితుడికి 15 ఏళ్ల జైలు

వేళచ్చేరి, ఏప్రిల్ 23: తోపూర్ సమీపంలో ప్లస్ టూ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన వ్యక్తికి ధర్మపురి పోక్సో న్యాయస్థానం 15 ఏళ్ల జైలుశిక్ష విధించింది. ధర్మపురి జిల్లా తోపూర్ సమీపంలోని గ్రామానికి చెందిన మారియప్పన్ 2017లో ప్లస్ టూ విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు తోపూరు పోలీసులు కేసు నమోదుచేసి మారియప్పన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ ధర్మపురి పోక్సో ప్రత్యేక న్యాయస్థానంలో జరుగుతుండగా, నిందితుడు మారియప్పన్‌కు 15 ఏళ్ల జైలుశిక్ష, రూ.35 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి సయ్యద్ బర్కతుల్లా మంగళవారం తీర్పు వెలువరించారు.

ధరలను అదుపుచేయండి

● పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్

వేళచ్చేరి, ఏప్రిల్ 23: నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలను అరికట్టి, రేషన్ దుకాణాల ద్వారా సరుకులందించేలా చర్యలు చేపట్టాలని పీఎంకే వ్యవస్థాపకుడు డా.రాందాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో నూనెలు, కిరాణా సరుకులు నెలరోజులుగా పెరుగుతూనే ఉన్నాయన్నారు. పప్పు రకాలు, పసుపు, మిరపపొడి తదితరాలు కిలోకు రూ.15 వరకు పెరిగాయన్నారు. పెరిగిన ధరలతో ఒక్కో కుటుంబంపై రూ.2,000 వరకు అదనపు భారం పడుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారన్నారు. పెరిగిన ధరలు నియంత్రించేలా కిరాణా సరుకులు రేషన్ దుకాణాల ద్వారా విక్రయించే చర్యలు చేపట్టాలని డా.రాందాస్ డిమాండ్ చేశారు.




'కూలీ'గా రజినీకాంత్

లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించే 171వ చిత్రం టైటిల్ 'కూలీ'గా ఖరారు చేశారు. సన్ పిక్చర్స్ బ్యానరుపై కళానిధి మారన్ నిర్మించే ఈ చిత్రానికి అనిరుధ్ రవిచంద్రన్ సంగీతం. ఈ సినిమా టైటిల్‌ను సోమవారం అధికారికంగా ప్రకటించి, టీజర్ కూడా రిలీజ్ చేశారు. ఇందులో రజినీకాంత్ స్టయిల్ ఫైట్‌ను చూడొచ్చు. "మన తాతలు, ముత్తాతలు వచ్చారు పోయారు. తప్పేంటి.. ఒప్పేంటి.. కొత్తగా కుమ్మేసెయ్.. ఏ దారిలో వెళ్ళినా సుఖాన్ని విడవకు' అంటూ రజినీకాంత్ తన స్టైల్‌లో చెప్పే డైలాగ్ అదిరిపోయింది. అదేవిధంగా విలన్‌ను చితకబాదే సమయంలో 'విందుంది.. చిందుంది.. మందుంది... సుఖముంది... అనుభవించే మనసుందంటే స్వర్గంలో చోటుంటుంది.. పోరా' అంటూ రజినీ చెప్పే మరో డైలాగ్ కూడా చూడొచ్చు. కాగా, ఈ చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడించానున్నారు. మరోవైపు రజినీకాంత్ నటిస్తున్న 'వేట్టయ్యాన్' చిత్రం షూటింగ్ శరవేగంగా సాగుతున్న విషయం తెల్సిందే.

లేటు వయసులో
హాట్ హాట్‌గా....

విశ్వనటుడు కమల్ హాసన్ 'ఇండియన్-2' చిత్రంలో నటిస్తున్న కాజల్ అగర్వాల్ యువతరం కంటిపై కునుకు లేకుండా చేసేలా ఎక్స్‌పోజింగ్ చేసింది.. శ్వేతవర్ణ దుస్తులు ధరించి దిగిన ప్రత్యేక ఫొటో షూట్ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో ఇవి వైరల్ అయ్యాయి. వివాహమై ఓ బిడ్డకు తల్లయిన కాజల్... లేటు వయసులో ఎక్స్‌పోజింగ్ చేస్తోంది. 2008లో పేరరసు దర్శకత్వంలో వచ్చిన 'పళని' చిత్రం ద్వారా కోలీవుడ్‌కు పరిచయమైన కాజల్... ఆ తర్వాత తమిళం, తెలుగు, హిందీ తదితర భాషా చిత్రాల్లో నటిస్తూ బిజీ హీరోయిన్‌గా మారింది. తమిళంలో 'నాన్ మహాన్ అల్ల', 'తుపాకీ', 'జిల్లా', 'మాట్రాన్', 'మారి' వంటి హిట్ సినిమాల్లో నటించి చివరగా 2023లో 'కరుంగాప్పియం'లో నటించింది. ప్రస్తుతం 'ఇండియన్-2' లో నటిస్తున్న నేపథ్యంలో కాజల్ ఉన్నట్టుండి ఎక్స్‌పోజింగ్ చేస్తూ తీసిన ఫొటోలను షేర్ చేయడం గమనార్హం.

చిత్రజ్యోతి


కాజల్ అగర్వాల్

26న విడుదలవుతున్న నాలుగు చిత్రాలు

ఏప్రిల్ నెలలో చివరి శుక్రవారమైన ఈ నెల 26 న నాలుగు చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. వీటిలో ఒకటి హరి దర్శకత్వంలో విశాల్ - ప్రియా భవానీ శంకర్ జంటగా నటించిన 'రత్నం'. తమిళం, తెలుగు భాషల్లో విడుదల చేస్తుండగా, వారం రోజుల తర్వాత హిందీలో రిలీజ్ చేసేలా ప్లాన్ చేశారు. మణివర్మన్ దర్శకత్వంలో తమన్ కుమార్, ఎంఎస్ భాస్కర్ తదితరులు నటించిన 'ఒరు నొడి', ఎస్.శశికుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన 'ఇంగు మిరుగంగల్ వాళుం ఇడమ్'. ఇందులో షైన్ జాన్, శ్రీదేవి, ఉన్నికృష్ణన్ తదితరులు నటించారు. యువన్ ప్రభాకరన్, సమంత జంటగా, ప్రభు దర్శకత్వంలో తెరకెక్కిన 'కొళై దూరం' చిత్రం విడుదలకానున్నాయి. అయితే, శుక్రవారానికి మరికొన్ని చిన్నబడ్జెట్ చిత్రాలు విడుదలయ్యే అవకాశాలు కూడా ఉన్నాయని కోలీవుడ్ వర్గాలు పేర్కొంటున్నాయి.


'రత్నం'లో విశాల్

సూర్య చిత్రంలో నటించాలనివుందా?

● కాస్టింగ్ కాల్

హీరో సూర్య నటించే 44వ చిత్రంలో నటించేందుకు నటీనటుల ఎంపిక చేపట్టారు. ఇందుకోసం ఆసక్తిగల యువనటీనటులు సంప్రదించవచ్చని పేర్కొంది. ఇందుకోసం కాస్టింగ్ కాల్ పేరుతో ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కాస్టింగ్ కాల్‌కు భాషతో సంబంధం లేకుండా ఎనిమిదేళ్ళ నుంచి 80 యేళ్ళ వయస్సున్న స్త్రీపురుషులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించింది. అలాగే, ఒకటి నుంచి మూడు నిమిషాల నిడివి కలిగిన వీడియో కూడా పంపించాలని పేర్కొంది. కార్తీక్ సుబ్బరాజ్ దర్శకుడు. రజినీకాంత్ 'పేట' చిత్రం ద్వారా కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వం వహించే చిత్రం కాగా, సూర్య నటించే 44వ చిత్రం. పీరియాడిక్ గ్యాంగ్‌స్టర్, లవ్ నేపథ్యంలో ఈ స్టోరీ ఉంటుందని, సూర్య ద్విపాత్రాభినయం చేస్తారనే ప్రచారం సాగుతుంది. జూన్ 17 నుంచి ప్రారంభమయ్యే ఈ చిత్రానికి తిరునావుక్కరసు ఛాయాగ్రహణం అందిస్తుండగా, సంతోష్ నారాయణన్ సంగీతం స్వరాలు సమకూర్చనున్నారు. ఈ చిత్రాన్ని 2డి ఎంటర్‌టైన్మెంట్స్, స్టోన్‌బెంచ్ ఫిలిమ్స్ సంయుక్తంగా నిర్మించనున్నాయి.



కాకలూరులో వైభవంగా
జానకీరాముల కల్యాణం

ప్యారీస్, ఏప్రిల్ 23: తిరువళ్లూర్ సమీపంలోని కాకలూరు మారుతి న్యూటౌన్ సెల్వగణపతి దేవస్థానంలో ఉన్న శ్రీరాముడి సన్నిధిలో శ్రీరామ నవమి, చైత్ర పౌర్ణమి, హనుమాన్ జయంతి వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఇటీవల కుంభాభిషేకం నిర్వహించిన సీతా సమేత శ్రీరామ సన్నిధి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం జానకీరాముల కల్యాణాన్ని పురోహితులు ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఉత్సవ మూర్తులకు అభిషేకాలు చేసి అనంతరం సీతారాములను వధూవరులుగా అలంకరించి లక్ష్మణుడు, ఆంజనేయస్వామి ఉత్సవమూర్తులతో పాటు వేదికపై కొలువుదీర్చారు. ప్రత్యేక పూజలు, హోమం అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. ఆలయ స్థాపకులు వి.శ్రీ మన్నారాయణ, నిర్వాహకులు బంగారు పుస్తెలు, పట్టువస్త్రాలు, వెండి జంధ్యం, ముత్యాల తలంబ్రాలు సమర్పించి పూజల్లో పాల్గొన్నారు. పురోహితుడు సుసర్ల కుటుంబ శాస్త్రి బృందం తిరుకల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకాగా, వేదికను అరటి, మామిడి తోరణాలు, రంగవల్లికలతో అందంగా అలంకరించారు.


సీతారాములకు ముత్తయిదువుల హారతి


ఉత్సవమూర్తులకు తిరుకల్యాణం

ఒకే సమయంలో
సూర్యాస్తమయం-చంద్రోదయం

● కన్నియాకుమారిలో అపురూప దృశ్యం

పెరంబూర్, ఏప్రిల్ 23: చిత్తిరై మాసం పౌర్ణమిని భక్తులు కోలాహలంగా జరుపుకున్నారు. ఆ రోజున సూర్యాస్తమయం, చంద్రోదయం ఒకే సమయంలో కన్నియాకుమారిలో కనిపించే అపురూప దృశ్యం వీక్షించేందుకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఈ ఏడాది చిత్తిరై పౌర్ణమి మంగళవారం రాగా, భక్తులు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో, మంగళవారం సాయంత్రం 6 గంటలకు కన్నియాకుమారిలో సూర్యాస్తమయం జరిగే సమయంలో చంద్రోదయం అయ్యే దృశ్యాలను భక్తులు వీక్షించారు. ఈ అరుదైన సంఘటనలో, సూర్యుడు బంతి ఆకారంలో అరేబియా సముద్రం పశ్చిమ వైపులో మునిగిపోతాడు. ఆ సమయంలో తూర్పు బంగాళాఖాతం ప్రాంతంలో చంద్రుడు వృత్తాకార కాంతిలో కనిపిస్తాడు. ఈ దృశ్యాన్ని వీక్షించేందుకు కన్నియాకుమారి త్రివేణి సంగమం, సన్‌సెట్ తీర ప్రాంతాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.




ఆయుర్వేద కేంద్రాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ ప్రీతారెడ్డి తదితరులు


వానగరం అపోలో ఆస్పత్రిలో
ఆయుర్వేద కేంద్రం ప్రారంభం

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా వానగరం ప్రాంతంలోని అపోలో ఆస్పత్రిలో మంగళవారం ఉదయం అపోలో ఆయుర్వేద హాస్పిటల్స్ పేరుతో సమగ్రమైన ఆయుర్వేద చికిత్సా కేంద్రాన్ని అపోలో గ్రూపు ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ ప్రీతారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికి వరకూ అంతర్జాతీయ స్థాయి వైద్య సదుపాయాలు అందిస్తున్న అపోలో ఆసుపత్రులు భారతీయ ప్రాచీన ఆయుర్వేద వైద్యానికి కూడా పట్టంగట్టేలా కొత్త ఆయుర్వేద కేంద్రాన్ని వానగరం ఆస్పత్రిలో ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ నరసింహయ్య శ్రీనివాసన్, సీఎంవో డాక్టర్ జాన్‌ఖన్నా బుచ్, వానగరం అపోలో హాస్పిటల్స్ అసిస్టెంట్ చీఫ్ ఫిజీషియన్ డాక్టర్ అజిత్‌కుమార్, ఆపోలో ఆయుర్వేద హాస్పిటల్స్ ఎండీ రాజీవ్ వాసుదేవన్ తదితరులు పాల్గొన్నారు.

బర్డ్‌ఫ్లూ నిరోధానికి 12 చోట్ల తనిఖీ కేంద్రాలు



చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): కేరళలో బర్డ్‌ఫ్లూ కారణంగా కోళ్లు, బాతులు వందల సంఖ్యలో చనిపోవడంతో ఆ వ్యాధి రాష్ట్రంలో ప్రవేశించకుండా ఉండేందుకు 12 చోట్ల వెటర్నరీ శాఖ అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కేరళలోని ఆళపుళా జిల్లాలో ఓ బాతుల పెంపకం కేంద్రంలో సోకిన బర్డ్ ఫ్లూ కారణంగా ఒకే సమయంలో వెయ్యికి పైగా బాతులు మరణించాయి.. దీంతో ఆ ప్రాంతానికి కిలోమీటర్ చుట్టూ పెంచుతున్న కోళ్ళు, బాతులను, కాడై పక్షులను నాశనం చేయడానికి వెటర్నరీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ పరిస్థితులలో కేరళ రాష్ట్రాన్ని ఆనుకుని ఉన్న రాష్ట్ర సరిహద్దుల్లో ప్రభుత్వం నిఘా ఏర్పాటుచేసింది. ఆ మేరకు తెన్‌కాశి జిల్లా పులియరై చెక్‌పోస్ట్ వద్ద వెటర్నరీ అధికారులు కేరళ నుంచి వస్తున్న వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఇదే విధంగా కోయంబత్తూరు, నీలగిరి, కన్నియాకుమారి జిల్లా సరిహద్దులలోనూ కేరళ నుంచి వచ్చే ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్నారు. కేరళకు చేరువుగా ఉన్న రాష్ట్ర సరిహద్దుల్లో 12 చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కేరళ నుంచి వచ్చే వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కేరళ నుంచి లారీలలో వచ్చే కోళ్ల, బాతులు, కోడిగుడ్లను తిప్పిపంపుతున్నారు. కేరళ నుండి కాయగూరల లోడుతో వచ్చే వాహనాలను కూడా రాష్ట్రంలోకి అనుమతించడం లేదు. కేరళ మీదుగా వచ్చే లారీలు, ట్రక్కులపై వెటర్నరీ అధికారులు క్రిమిసంహారక మందులను పిచికారీ చేస్తున్నారు. కేరళకు ఫారమ్ కోళ్లను తీసుకెళ్ళి తిరిగొచ్చే లారీలను, వ్యాన్‌లపై కూడా క్రిమిసంహారక మందులు చల్లుతున్నారు. ప్రతి చెక్‌పోస్టు వద్ద వెటర్నరీ విభాగానికి చెందిన నలుగురు అధికారులు, సూపర్‌వైజర్లు షిఫ్ట్‌పద్ధతిలో డ్యూటీ చేస్తున్నారు. కేరళ నుండి వచ్చే ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేసిన మీదటే వాటిని రాష్ట్రంలోకి అనుమతిస్తున్నారు.


మహాబలిపురంలో స్థల శయనపెరుమాళ్ ఆలయ చిత్తిరై ఉత్సవాల్లో భాగంగా అర్జున తపస్సు ప్రాంతంలో ఊరేగుతున్న రథం


ట్రిప్లికేన్ పార్థసారథి ఆలయంలో చిత్తిరై బ్రహ్మోత్సవాల కోసం ధ్వజారోహణం చేస్తున్న ప్రధానార్చకులు


చిత్రా పౌర్ణమి సందర్భంగా మెరీనాబీచ్‌లో కన్నగి విగ్రహం వద్ద ఆమె చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తమిళభాషాభివృద్ధి సమాచార శాఖ కార్యదర్శి సుబ్రమణియన్, సమాచార శాఖ సంచాలకులు వైద్యనాథన్, తమిళభాషాభివృద్ధి శాఖ సంచాలకులు అరుళ్ తదితరులు

శ్రీసిటీలో సుస్థిర పర్యావరణ
సామాజిక నిర్వహణ పద్ధతులపై సదస్సు

శ్రీసిటీ, ఏప్రిల్ 23: మద్రాస్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్(ఎంసీసీఐ), శ్రీసిటీ సంయుక్తంగా మంగళవారం తిరుపతి జిల్లాలోని శ్రీసిటీ బిజినెస్ సెంటర్‌లో ఈఎస్‌జీ సర్క్యులర్ ఎకానమీ, డీ కార్బనైజేషన్ అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించింది. సుస్థిర పర్యావరణ సామాజిక నిర్వహణ పద్ధతులు, ఆర్థిక సూత్రాలు, పరిశ్రమల కర్బన రహిత ప్రణాళికల గురించి అవగాహన పెంచడమే ఈ సదస్సు లక్ష్యం. శ్రీసిటీలోని పలు పరిశ్రమల ఉన్నతాధికారులు ఇందులో పాల్గొని నిపుణుల ఉపన్యాసాలను వినడంతో పాటు వారితో పరస్పర చర్చలు జరిపారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి తన ప్రారంభోపన్యాసంలో సదస్సు ప్రాముఖ్యత ఆవశ్యకతను వివరించారు. ప్రస్తుత కీలక తరుణంలో సుస్థిరత, వినూత్న ఆవిష్కరణలు, జవాబుదారీతనం ప్రధాన సవాళ్లుగా మారాయన్నారు. ఈ సదస్సును వినియోగించుకుని పై సవాళ్లను అధికమించడానికి సమిష్టిగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పరిశ్రమల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో చురుకైన పాత్ర పోషించాలని, చర్చల్లో పాల్గొని వారి అభిప్రాయాలను పంచుకోవాలని ఆయన సూచించారు. ఎన్వీ రాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సెంటర్ అధికారి శివరంజని సుబ్రమణియన్‌తో సహా పలువురు వక్తలు వారి ప్రసంగంలో ఈఎస్‌జీ సూత్రాల ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. ఎన్వీ రాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సెంటర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ ఆశా పన్వార్ మాట్లాడుతూ సుస్థిరతను పెంపొందించడంలో సర్క్యులర్ ఎకానమీ ప్రాముఖ్యతను వివరించారు. ఎన్వీ రాన్‌మెంటల్ మేనేజ్‌మెంట్ సెంటర్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ జె.మెహతా కర్బన రాహిత్య సూత్రాలతో నికర సున్నా ఉద్గారాల లక్ష్యాన్ని సాధించడానికి పలు సూచనలు చేశారు. ప్రశ్నలు సమాధానాలతో సదస్సు ఆసక్తికరంగా ముగిసింది. ఎంసీసీఐ సెక్రటరీ జనరల్ సరస్వతి మాట్లాడుతూ ఎంసీసీఐ పరిణామక్రమం, సుస్థిరత, బాధ్యతాయుతమైన వ్యాపార పద్ధతులను ప్రోత్సహించడంలో సంస్థ సహకార చర్యలను వెల్లడించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు, పరిశ్రమ ప్రతినిధులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సులో శ్రీసిటీ ప్రెసిడెంట్(ఆపరేషన్స్) సతీష్ కామత్, శ్రీసిటీ పర్యావరణ విభాగ అధికారి డా. వెంకట్ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, సరస్వతి, శివరంజని

వేసవిలో నేత్రాల సంరక్షణ ఇలా...

చెన్నై, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవిలో ఎదురయ్యే కంటి సమస్యల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ అగర్వాల్ ఐ హాస్పిటల్స్ క్లినికల్ సర్వీసెస్ రీజినల్ హెడ్ డాక్టర్ సౌందరి తెలిపారు. ఈ మేరకు వేసవిలో నేత్రాలకు ఎదురయ్యే సమస్యలను వివరిస్తూ తేలికపాటి చిట్కాలు పాటించాలని కోరారు. వేసవి కారణంగా కళ్ళల్లో తడి ఆరిపోతుందని, కంటి కలక వంటి వ్యాధులు కూడా వస్తాయని తెలిపారు. సూర్యుడి హానికరమైన కిరణాలు కూడా కళ్ళలో మంటలు పుట్టిస్తాయన్నారు. ఈ సమస్యల రాకుండా ఉండాలంటే కళ్ల తడారకుండా ఉండటానికి డాక్టర్లు సూచించే ఐడ్రాప్స్ వాడాలని తెలిపారు. కళ్ళను ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని, చేతులను తరచూ శుభ్రంగా కడగాలని, కాంటాక్ట్ లెన్స్‌లను అమర్చుకునే సమయాల్లో చేతులను శుభ్రంగా కడగాలన్నారు. యూవీ రక్షణతో కూడిన సన్‌గ్లాసెస్ ధరించాలని, నిర్జలీకరణను నివారించడానికి తరచూ మంచినీటిని తాగాలని, రసాయనాలకు దూరంగా ఉండాలని, ఈతకొట్టేటప్పుడు స్విమ్మింగ్ గాగుల్స్ ధరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. అంతే కాకుండా ఎల్లప్పుడూ కంప్యూటర్, మొబైల్ గేమ్‌లు ఆడకుండా ఉంటే కళ్ళ సమస్యలు రావని ఆమె పేర్కొన్నారు.


డాక్టర్ సౌందరి

ఘనంగా బైబిల్ కాల్స్ కళాశాల స్నాతకోత్సవం


డోరా కావ్యం పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డా.ఆంద్రూదేవ్

ప్యారీస్, ఏప్రిల్ 23: స్థానిక మొగప్పేర్‌లోని బైబిల్ కాల్స్ ఆధ్యాత్మిక కళాశాల 13వ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. బైబిల్ కాల్స్ ట్రస్ట్ ఛైర్మెన్ డా.ఆంద్రూదేవ్ నేతృత్వంలో నిర్వహించిన ఈ వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాస్టర్ జాన్ కాలేబు, విశిష్టఅతిథులుగా పాస్టర్ విన్సెంట్ సామ్యూల్, పాస్టర్ ఏసీఏ ఆనంద్, ఆల్బర్ట్ సాల్మన్, శ్యాం తదితరులు పాల్గొన్నారు. డా.జయరాణి స్వాగతోపన్యాసం చేయగా, ఆంద్రూదేవ్ రచించిన డోరా కావ్యం అనే పుస్తకం, న్యూ టెస్టిమెంట్ గైడ్‌ను ఆవిష్కరించారు.

తిరుమలేశుడి సేవలో
మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆర్ఎంటీ టీకా రామన్ మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రాత్రి నైవేద్య విరామ సమయంలో కుటుంబ సమేతంగా ఆలయంలోకి వెళ్లారు. ముందుగా ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు. న్యాయమూర్తికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.


ఆలయం ముందు జస్టిస్ ఆర్ఎంటీ టీకా రామన్

అటెండరు రూపాయి లంచం

- నైతిక బాధ్యత వహించి మద్రాసు ప్రావిన్స్ పీఎం రాజీనామా
- నాడు నైతిక విలువలకు పెద్దపీట వేసిన చిత్తూరుజిల్లావాసి

చిరస్మరణీయులు



బొల్లిని మునస్వామి నాయుడు

తమపై వేల రూ.కోట్ల అవినీతి ఆరోపణలు వచ్చినా ఇప్పటి నేతలు పదవులను పట్టుకుని వేలాడుతూనే ఉన్నారు. అక్రమాస్తుల కేసులున్నా వెరవడంలేదు. పైగా నీతి బోధనలు చేస్తున్నారు. కానీ.. తన వద్ద పనిచేసే ఒక అటెండరు రూపాయి లంచం తీసుకున్నాడని మద్రాస్ ప్రావిన్స్ ప్రధానమంత్రి పదవికే రాజీనామా చేశారు బొల్లిని మునస్వామి నాయుడు. నాడు నైతిక విలువలు పాటించి.. నేటి తరానికీ ఆదర్శంగా నిలిచిన ఆయన చిత్తూరు జిల్లాకు చెందిన వారు. చిత్తూరు సమీపం వేపంజేరిలో 1885 ఏప్రిల్‌లో బొల్లిని మునస్వామి నాయుడు జన్మించారు. 1908లో న్యాయవాద వృత్తిలో డిగ్రీ పొందారు. సొంతంగా ప్రాక్టీస్ ప్రారంభించి మంచి పేరు పొందారు. 1920లో చిత్తూరు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా, 1918లో 16వ చిత్తూరు మండల మహాసభ ఆహ్వానసంఘం అధ్యక్షుడిగా, 1921లో చిత్తూరు మున్సిపల్ ఛైర్మన్‌గా, 1923 నుంచి చిత్తూరు జిల్లా బోర్డు (జిల్లా పరిషత్) అధ్యక్షుడిగా పనిచేశారు. మద్రాసు విశ్వవిద్యాలయ సభ్యుడిగానూ కొనసాగారు. 1919-25 మధ్య మద్రాసు శాసనసభ సభ్యుడిగా, 1930లో మద్రాసు ప్రావిన్స్ ప్రధానమంత్రిగా ఎన్నికై 1934వరకు కొనసాగారు. అప్పట్లో ఈ పదవిని ప్రధానమంత్రి అనేవారు. తమ గ్రామాల సమీపంలోని అడవుల్లో పశువులు మేపుకొనేందుకు ఆయన అనుమతించారు. ఈయన ప్రధానమంత్రిగా పనిచేస్తున్న రోజుల్లో ఓ అటెండరు రూపాయి లంచం తీసుకున్నట్లు శాసనసభలో బయటపడింది. దీనిపై విచారణ జరిపితే నిజమని తేలింది. వెంటనే ఆయన ప్రధానమంత్రి పదవికి రాజీనామా చేసి జట్కాబండిలో ఇంటికి వెళ్లారట. ఈయన మహోన్నత వ్యక్తిత్వాన్ని గుర్తించిన ఆంగ్లేయులు 1926లో 'దివాన్ బహదూర్' పురస్కారంతో సత్కరించారు.

- చిత్తూరు కలెక్టరేట్

లెక్క చెప్పాల్సిందే...

నోట్ దిస్ పాయింట్



ఎన్నికల సమయంలో బ్యాంకులోనే కాదు ఆన్‌లైన్ ఆర్థిక లావాదేవీలపైనా ఎన్నికల అధికారులు కన్నేశారు. ప్రస్తుతం ఎక్కడ చూసినా డిజిటల్ పేమెంట్లు ఎక్కువయ్యాయి. ఎన్నికల నేపథ్యంలో బ్యాంకు ఖాతాల్లో అనూహ్యంగా నగదు బదిలీలు, పరిమితికి మించి జమ, విత్‌డ్రాలు పెరగడంతో అధికారులు నిఘా తీవ్రతరం చేశారు. ఇందుకోసం బ్యాంకు, పోలీసు, ఐటీ విభాగం, ఎన్నికల అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారు. బ్యాంకుల్లో లక్షకు మించి డబ్బు జమ, విత్ డ్రా చేస్తే వీరు దృష్టికి వెళుతుంది. రూ.10 లక్షలు మించి లావాదేవీలు జరిగితే ఆదాయ పన్ను శాఖకు వీరె సమాచారం అందిస్తారు. అనుమానాస్పద లావాదేవీలను గుర్తించేందుకు ఎన్నికల సంఘం ఆదేశాల ప్రకారం స్టాండర్డ్ పొజిషన్ పద్ధతిని రూపొందించారు. దీని ప్రకారం డిపాజిట్, విత్ డ్రాలతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డులతోపాటు డిజిటల్ చెల్లింపులన్నింటినీ నిశితంగా గమనిస్తున్నారు. ఎక్కువ సార్లు చిన్న మొత్తాల నగదు విత్‌డ్రా లావాదేవీలను పరిశీలించే ఓ వ్యవస్థను కూడా అందుబాటులోకి తీసుకువచ్చారు. అంతేకాకుండా గ్రామీణ బ్యాంకుల్లో జీరో బ్యాలెన్సు ఖాతాలు, ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన ఖాతాలను సైతం నిశితంగా గమనిస్తున్నట్లు సమాచారం. ఎన్నికల ముందు వరకూ లావాదేవీలు లేకుండా ఇప్పుడు అనూహ్యంగా పెరిగితే అందుకు కారణాలపై కూడా ఆరా తీస్తున్నారు.

- వెంకటగిరి/ డక్కిలి

చంద్రగిరి చరిత్ర



చంద్రబాబు పుట్టినగడ్డ

టీడీపీ అధినేత రాజకీయ కెరీర్‌కు శ్రీకారం ఇక్కడే

గల్లా అరుణకుమారి హ్యాట్రిక్ ఎమ్మెల్యే

దశాబ్దంన్నర పాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన నారా చంద్రబాబునాయుడి సొంతగడ్డ చంద్రగిరి నియోజకవర్గం. ఈ నియోజకవర్గం నుంచే ఆయన రాజకీయారంగేట్రం చేశారు. 1978లో కాంగ్రెస్ నుంచి ఆయన ఎమ్మెల్యేగా తొలిసారి ప్రాతినిధ్యం వహించారు. గల్లా అరుణకుమారి మూడుసార్లు వరుసగా కాంగ్రెస్ నుంచి గెలిచి హ్యాట్రిక్ సృష్టించారు. తిరుపతి, తిరుమల ప్రభావం కనిపించే చంద్రగిరి- ఆరంభం నుంచి ఇప్పటివరకూ పలుమార్లు పరిధులు మార్చుకుంది. 1952లో చంద్రగిరి నియోజకవర్గం జనరల్ కేటగిరిగా ఏర్పడింది. మూడేళ్ల తరువాత తవణంపల్లెగా మారింది. 1967లో బంగారుపాలెంగా మారింది. 1978లో తిరిగి చంద్రగిరి నియోజకవర్గంగా రూపాంతరం చెందింది. చంద్రగిరి నియోజకవర్గంలో చంద్రగిరి, పాకాల, ఐరాల, తవణంపల్లె మండలాలతోపాటు తిరుపతి రూరల్ కొంత భాగం ఉండేది. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో కొంత మార్పులను సంతరించుకుని పరిధి విస్తృతం చేసుకుంది. ప్రస్తుతం చంద్రగిరి, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, పాకాల, ఎర్రావారిపాలెం, తిరుపతి రూరల్ మండలాలు చంద్రగిరి నియోజకవర్గంలో ఉన్నాయి.

- చంద్రగిరి

ఎమ్మెల్యేలు

1952 ఎ.ఆదికేశవులు నాయుడు - కాంగ్రెస్
1978 -నారా చంద్రబాబునాయుడు - కాంగ్రెస్
1983- మేడసాని వెంకటరామనాయుడు- టీడీపీ
1985 - ఎన్ఆర్ జయదేవనాయుడు- టీడీపీ
1989- గల్లా అరుణకుమారి - కాంగ్రెస్
1994- నారా రామ్మూర్తి నాయుడు -టీడీపీ
1999, 2004, 2009- గల్లా అరుణకుమారి
2014, 2019 - చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి -వైసీపీ

మొత్తం ఓటర్ల సంఖ్య : 3,08,916
పురుషులు : 1,50,249
మహిళలు: 1,58,607, ఇతరులు: 60





ఏర్పేడు మండలం పాగాలి వద్ద సీఎం జగన్ వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ఇండస్ట్రియల్ పార్క్ బ్లాక్-2 స్థితిని తెలుపుతున్న బీడు భూములు.





జగన్ పాగాలి కబుర్లు

- ఆర్నెళ్ల క్రితం ఇండస్ట్రియల్ పార్క్ పేరిట హడావిడి
- తాడేపల్లి నుంచి వర్చువల్‌గా శంకుస్థాపన
- ఐదు నెలలవుతున్నా అతీగతీ లేని ఏపీఐఐసీ
- పరిశ్రమలూ లేవు..రైతులకు పరిహారమూ లేదు
- టీడీపీ ప్రభుత్వంలోనే జరిగిన భూసేకరణ

పారిశ్రామిక వాడ పేరిట జగన్ ఉత్తుత్తి శంకుస్థాపన చేసి గాలికొదిలేసిన వైనం అభాసుపాలైంది. టీడీపీ సేకరించిన భూముల్లోనే పరిశ్రమలొస్తున్నాయంటూ చేసిన ఆర్భాటం వైసీపీ మోసపు పోకడ తీరును బహిర్గతం చేసింది. తెలుగుదేశం హయాంలో పారిశ్రామిక పురోగతి జిల్లా ప్రజల్లో బలంగా నాటుకుందని జగన్ ప్రభుత్వం గుర్తించింది. దీంతో తామూ పరిశ్రమలను ఏర్పాటు చేయించినట్లు కలర్ ఇవ్వాలని భావించి భంగపడింది.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

సీఎం వర్చువల్ శంకుస్థాపన

ఏర్పేడు మండలం పాగాలి గ్రామం వద్ద ఇండస్ట్రియల్ పార్క్‌కు సంబంధించి రెండవ బ్లాక్ ఏర్పాటుకు గతేడాది నవంబరు 23న సీఎం జగన్ తాడేపల్లి నుంచీ వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హామీలిస్తూ అరచేతిలో వైకుంఠం చూపించారు. ఈ పారిశ్రామిక వాడకు కేంద్ర పరిశ్రమల శాఖ ద్వారా సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ కింద అనుమతులొచ్చాయన్నారు. ఈ కొత్త పార్కులో 44.11 ఎకరాల్లో అభివృద్ధి పనులు చేపట్టి మౌళిక సదుపాయాలు కల్పించి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తామన్నారు. పార్కు అభివృద్ధికి కేంద్రం 70 శాతం వాటా కింద రూ. 7.21 కోట్లు, రాష్ట్ర ప్రభుత్వం 30 శాతం వాటా కింద రూ. 3.09 కోట్లు చొప్పున మొత్తం రూ. 10.33 కోట్లతో పనులు చేపడతామన్నారు. దీంతో సూక్ష్మ, చిన్న పరిశ్రమలు వచ్చేస్తున్నాయని చాలామంది భావించారు.

సీను కట్ చేస్తే..

ఐదు నెలలవుతున్నా పాగాలి పారిశ్రామికవాడ భూముల్లో అభివృద్ధి పనులు కాదు కదా ఇంతవరకూ ఏపీఐఐసీ అధికారులు కాలు కూడా పెట్టలేదు. శంకుస్థాపన నాటికి భూముల్లో రైతులు మినుము సాగు చేస్తున్నారు. నెల కిందట కోతలు పూర్తి చేశారు. ఇప్పుడా భూములు బీడుగా కనిపిస్తున్నాయి. కనీసం భూములకు సంబంధించి రైతులకు పరిహారమూ చెల్లించలేదు. అలాగని పరిశ్రమలకూ కేటాయించలేదు. పరిశ్రమలను రప్పించే ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయలేదు. ఆరు నెలల్లో ఎన్నికలున్నాయని ప్రభుత్వం గత నవంబరులో హడావిడి చేసింది. జిల్లాలో టీడీపీతో పోల్చుకుని ఒక్క పరిశ్రమ కూడా రాలేదని విమర్శలు వెల్లువెత్తుతున్న తరుణంలో సీఎం జగన్ ఉత్తుత్తి శంకుస్థాపన చేశారు. అది కూడా వర్చువల్‌గా. పరిహారం రాకపోవడంతో పంగూరు బాధిత రైతులు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ, స్థానిక ఎమ్మెల్యే చుట్టూ తిరిగి విసిగి వేసారిపోయారు. మెట్ట భూములు కావడంతో వర్షాధార పంటలు సాగు చేసుకుంటున్నారు.

టీడీపీ హయాంలోనే అంకురం

పాగాలిలో పారిశ్రామిక వాడ ఏర్పాటు చేయాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. 2016లో 72 ఎకరాలను సేకరించింది. ఆ భూములు పంగూరు దళితులవి. అందులో 28 ఎకరాలను రాక్‌మెన్ కంపెనీకి ప్రభుత్వం కేటాయించింది. ఆ పరిశ్రమ ఏర్పాటై ప్రస్తుతం నడుస్తోంది. ఇంకా 44 ఎకరాల భూమి మిగిలింది. గత ప్రభుత్వం సేకరించిన భూమిలో 37 ఎకరాలకు అప్పట్లోనే రైతులకు పరిహారం చెల్లించేసింది. మరో 35ఎకరాలకు రికార్డులు సక్రమంగా లేక పరిహారం చెల్లింపు పెండింగులో ఉంది.



మా కడుపు కొట్టి లాక్కున్నారు

మా కడుపు కొట్టి పంట పండే భూమిని లాక్కున్నారు. ఇప్పటికీ పరిహారం ఇవ్వలేదు. కాళ్లరిగేలా తిరుగుతున్నా ఈ ప్రభుత్వంలో ఎవరూ స్పందించడంలేదు. ఎవరికి చెప్పాలో తెలియక, పంటలు లేక ఇబ్బందులు పడుతున్నాం.

- చెంగమ్మ, పాగాలి



భూముల జోలికొస్తే చావోరేవో తేల్చుకుంటాం

భూముల జోలికి వస్తే చావోరేవో తేల్చుకుంటాం. అప్పట్లో ఎకరాకు రూ.10లక్షలు పరిహారం ఇస్తామని స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో కొంతమందికి ఉద్యోగాలు కల్పిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. పరిహారం ఇవ్వలేదు. ఉద్యోగాలు ఇవ్వలేదు. రైతులను మాత్రం బెదిరిస్తున్నారు.

- నాగమ్మ, పాగాలి



పరిహారం ఇవ్వకుండా ఖాళీ చేయం

ఏపీఐఐసీ 2018లో భూములు తీసుకుంది. పరిహారం ఇవ్వలేదు. నేటికీ ఆ భూముల్లో వర్షాధార పంటలు పండించుకుని బతుకుతున్నాం. మూడు నెలల క్రితం కొంతమంది రెవెన్యూ అధికారులు వచ్చి భూములు వదలిపెట్టాలని భయపెడుతున్నారు. ఇది ఎక్కడి న్యాయమో అర్థం కావడంలేదు. పరిహారం ఇవ్వకుండానే భూములను వదలిపెట్టమని చెప్పడం బాధాకరం.

- రంగారెడ్డి, పాగాలి



చెవిలో పువ్వు



ఫిబ్రవరి నెలలో తిరుచానూరు రైతు బజారు ప్రారంభించి కూరగాయలు కొనుగోలు చేస్తున్న మోహిత్‌రెడ్డి



గేటు తెరుచుకోని రైతు బజారు

1 DAY రైతుబజార్ చూశారా..

- తిరుచానూరు రైతు బజారు ఒక రోజుకే మూత
- చెవిరెడ్డి మోహిత్ దర్శకత్వంలో ఫ్లాప్ షో


ఎన్నికల వేళ అధికార పార్టీ నేతలు జనం చెవిలో పెడుతున్న పువ్వులకు తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో రైతు బజారు ప్రారంభమే నిలువెత్తు ఉదాహరణ. గతంలో సుమారు రూ.50లక్షలతో రైతు బజారు నిర్మించారు. 56మంది రైతులు వ్యాపారం చేసుకునేలా దుకాణాలు ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో రైతు బజారు ప్రారంభించేసి ప్రజల్లో క్రెడిట్ కొట్టేయాలనుకున్నారు చంద్రగిరి వైసీపీ నాయకులు. వెంటనే దీన్ని ప్రారంభించేయాలని తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆదరాబాదరాగా నిర్ణయించేశారు. ఇంకేముంది. ఈ ఏడాది ఫిబ్రవరి 14న ఆయనే స్వయంగా రిబ్బన్ కత్తిరించి రైతుబజారును ప్రారంభించేశారు. ఆ రోజు చుట్టుపక్కల ఉన్న రైతులను పిలిపించి కూరగాయల దుకాణాలు ఏర్పాటు చేయించారు. జనాలకంటే రాజకీయ నాయకులే ఎక్కువగా కొనుగోలు చేసేశారు. ఫోటోలు, వీడియోలు.. మీడియాకు గొప్పలు... అబ్బబ్బా... సినిమా షూటింగ్‌ను తలపించిందారోజు సన్నివేశం. అధిక ధరల గురించి చింతించాల్సిన అవసరం లేదు. రైతులు పంట అమ్మకం కాలేదని బాధపడాల్సిన పనిలేదు. పొలాల నుంచి నేరుగా రైతులు తెచ్చి ఈ రైతు బజారులో అమ్ముకోవచ్చు, తక్కువ ధరలకు ప్రజలు కొనుక్కోవచ్చంటూ మోహిత్ ఊదరగొట్టారు. తరువాత ఆయన అనుచరగణంతో కలిసి వెళ్లిపోయారు. రెండవ రోజుకే రైతు బజారు మూతపడింది. ప్రజల ఆశలపై నీళ్లు చల్లింది. ఎన్నికల స్టంటు అని తెలియని పరిసర ప్రాంత ప్రజలు మర్నాడు రైతు బజారు ఉందని వచ్చి ఈసురోమంటూ వెనుతిరిగారు. వైసీపీ నేతల తీరుపై స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. తిరుచానూరు

సీన్-1

ఎప్పుడు : ఈ ఏడాది ఫిబ్రవరి 14న
ఎక్కడ : తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ
కార్యక్రమం : రైతు బజారు ప్రారంభం
ప్రారంభించిన వారు : తుడా ఛైర్మన్, చంద్రగిరి వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

సీన్-2

ఎప్పుడు : ఈ ఏడాది ఫిబ్రవరి 15న
ఎక్కడ : తిరుచానూరు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణ
రైతుబజార్ పరిస్థితి : కాయగూరలూ లేవు.. విక్రయాలూ లేవు



చెంబేడు చెరువు

మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చుతాం. ఈ చెరువు పరిధిలోని గ్రామాల రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తాం. పంటలను సస్యశ్యామలం చేస్తాం.

2018 జనవరి 23వ తేదీన మండలంలో పాదయాత్ర నిర్వహించిన సందర్భంలో విపక్ష నేతగా జగన్ చెప్పిన మాటలివి.

జగన్ మాట నీటి మూట

- కార్యరూపం దాల్చని చెంబేడు రిజర్వాయర్
- 10 గ్రామాలకు సాగు, తాగునీరు ప్రశ్నార్థకమే

పెళ్లకూరు, ఏప్రిల్ 23: పెళ్లకూరు మండలంలోని చిన్నా, పెద్దా చెరువుల్లో కెల్లా తలమానికం చెంబేడు చెరువు. సుమారు 832.90 ఎకరాల విస్తీర్ణంలో విస్తరించిన ఈ చెరువు పరిధిలో నందిమాల, చెన్నప్పనాయుడుపేట, ఆబాకవారికండ్రిగ, నల్లగుంటకండ్రిగ, అర్థమాల, ఉమ్మలగుంట, వడ్డిపాలెం, మారినేనిపాలెం, ఆర్లపాడు, గుర్రప్పనాయుడు గ్రామాల చెరువులున్నాయి. ఈ చెరువుల కింద సుమారు 3వేల ఎకరాల వరకు సాగు భూములున్నాయి. వర్షాధారంపై ఆధారపడి సాగు చేసుకుంటున్న రైతులు చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మారిస్తే రెండు పంటలు పండించుకోవచ్చు. అంతేకాదు సుమారు 20వేల మంది జనాభాకు తాగునీరు కూడా అందుతుందని సంబంధిత అధికారుల అంచనా.

నిరాశే మిగిల్చారు.. : గతంలో ప్రతిపక్ష నేతగా ఉన్న జగన్ పాదయాత్ర సమయంలో మండలానికి వచ్చారు.స్థానిక నాయకులతో పాటు రైతులు ఆయన్ను కలిశారు. చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చాలని జగన్‌ను కోరారు. దీంతో ఆయన వెంటనే మాటిచ్చేశారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతుల సమస్య తీరుస్తానన్నారు. చెంబేడు చెరువును రిజర్వాయర్‌గా మార్చి రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోని వచ్చాక ఆయన ఆ ఊసే పట్టించుకోలేదు. 2021లో ఈ చెరువుకు సంబంధించి రూ.31 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. కానీ అవి బుట్టదాఖలయ్యాయి. ఒక్క రూపాయి కూడా మంజూరు కాలేదు. చెంబేడు చెరువు మినీ రిజర్వాయర్‌గా మారుతుందన్న రైతులు ఆశలు అడియాసలయ్యాయి.వర్షం పడితే సాగు చేయడం, లేకపోతే బీడుపొలాలుగా మిగిలిపోవడం రైతులకు పరిపాటిగా మారింది.